నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com


## కర్నూలు | నంద్యాల
మంగళవారం | 24 సెప్టెంబరు 2024 | పేజీలు 8

### రాష్ట్రాభివృద్ధి కోసం
# ప్రజల భాగస్వామ్యంతో స్వర్ణాంధ్ర

- @2047 దార్శనికపత్రం రూపకల్పన
- QR కోడ్ స్కాన్ ద్వారా ప్రజలు తమ అభిప్రాయాలను తెలియచేయండి
- జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్,జేసీ,అధికారులు

**కర్నూలు,మేజర్‌న్యూస్ ప్రతినిధి :** రాష్ట్ర ప్రభుత్వం 2047 విజన్ అభివృద్ధి కోసం సమగ్ర కసరత్తు చేపట్టిందని, ఇందులో భాగంగానే స్వర్ణాంధ్ర@2047 దార్శనిక పత్రాన్ని రూపొందిస్తోందని మిగతా 2లో


నంద్యాల సబ్ రిజిస్ట్రారు కార్యాలయం



నంద్యాల పురపాలక సంఘం కార్యాలయం



నంద్యాల తహసీల్దార్ కార్యాలయం

**నంద్యాల, మేజర్‌న్యూస్ బ్యూరో :** జిల్లాలో బదిలీల ప్రక్రియ ముగిసింది. కీలక ప్రభుత్వ శాఖల్లో ఐదు సంవత్సరాలు పూర్తయిన వారిని బదిలీ చేశారు. ప్రభుత్వ శాఖల్లో సాధారణంగా బదిలీల సమయంలో అధికార పార్టీ ప్రజా ప్రతినిధుల సిఫారస్‌లకు జిల్లా ఉన్నతాధికారులు పెద్ద పీట వేస్తారు. ఈసారి బదిలీల్లో అధికార పార్టీ మిగతా 2లో

- ఎమ్మెల్యేల ప్రతిపాదనలలో కొన్నింటికి మొండి చెయ్యి
- జిల్లా మంత్రులకు అదే పరిస్థితి
- పరిపాలన విధానం బూచి
- కొత్త-పాత అసోషియేషన్లు ఢీ అంటే ఢీ
- రెవెన్యూలో చక్రం తిప్పిన కలెక్టరేట్ కీలక అధికారి
- అనుయాయులకు పెద్ద పీట
- జిల్లా మంత్రులు సీరియస్

### నంద్యాల బదిలీల పై
# వైసీపీ ముద్ర!

రాష్ట్రంలో అధికార మార్పు జరిగింది. వైసీపీ పాలన ముగిసి టీడీపీ పాలనకు ప్రజలు పట్టం కట్టారు.ప్రభుత్వం ఏర్పడి మూడునెలలు దాటినా ఇంకా పరిపాలనపై వైసీపీ ముద్ర స్పష్టంగా కనిపిస్తుంది. జిల్లాలో ఏడు అసెంబ్లీలు, ఒక పార్లమెంట్ స్థానాన్ని టీడీపీ కైవసం చేసుకుంది. ప్రభుత్వం ఉన్నతాధికారులు మొదలుకొని అధికారులు ఆ క్రింది స్థాయి ఉద్యోగుల బదిలీలపై నిషేదాన్ని ఎత్తి వేసిన విషయం పాఠకులకు విధితమే. రాష్ట్రంలో వరదల ప్రభావంతో బదిలీలను రెండుసార్లు నిషేద ఎత్తివేతను పొడగించింది. జిల్లాలోని కొందరు ఎమ్మెల్యేల ప్రతిపాదనలకు ఉన్నతాధికారులు మొండి చేయి ఇచ్చారు. జిల్లాకు చెందిన మంత్రుల ప్రతిపాదనలు అదే పరిస్థితి కనిపిస్తుంది. జిల్లా, రాష్ట్రస్థాయి, జోనల్ స్థాయి ఉన్నతాధికారులు పరిపాలన పరమైన బూచీని చూపిస్తున్నారు. జిల్లాలోని రెవెన్యూ శాఖలో కలెక్టరేట్‌లోని కీలక అధికారి ఒకరు బదిలీల్లో తన ముద్ర స్పష్టంగా కనిపిస్తుంది. తన అనుయాయులకు గతంలో ఆయన పని చేసిన స్థానాల్లో పెద్ద పీట వేశారు. జిల్లా మంత్రులు ఇచ్చిన ప్రతిపాదనలు అమలుకు నోచుకోకపోవడంతో ఇద్దరు మంత్రులు సీరియస్‌గా ఉన్నట్లు తెలుస్తోంది. సబ్ రిజిస్టర్ కార్యాలయం, మున్సిపాలిటి తదితర శాఖల్లో ఎమ్మెల్యేలు, మంత్రులు ఇచ్చిన ప్రతిపాదనలను కొన్ని చోట్ల కొన్ని పోస్టింగ్‌ల్లో ప్రక్కన పెట్టడం జిల్లాలో చర్చనీయాంశంగా మారిన నేపథ్యంలో మేజర్‌న్యూస్ అందిస్తున్న కథనం ఇది..



జిల్లా కలెక్టర్ కార్యాలయం

- అన్న క్యాంటీన్ల ద్వారా రూ.5 లకే నాణ్యమైన, రుచికరమైన ఆహారం
- రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి టి.జి. భరత్

**కర్నూలు, మేజర్ న్యూస్ :** పేదల ఆకలి తీర్చేందుకు అన్నక్యాంటీన్లను ఏర్పాటు చేసి నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని 5 రూపాయలకే మూడు పూటలా అందిస్తున్నామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి వర్యులు టి.జి.భరత్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ వద్ద, స్థానిక పాత బస్ స్టాండ్ వద్ద కొండారెడ్డి బురుజు సమీపంలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌లను రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, మిగతా 2లో

### పేదల ఆకలి తీర్చేందుకే
# అన్న క్యాంటీన్ల ఏర్పాటు



### కంభళదిన్నేలో వక్ఫ్‌బోర్డు భూములు
# హాంఫట్..!

- 69-71ఎకరాలవక్ఫ్ భూములను కబ్జా చేసి పట్టాదారు పాసుపుస్తకాలు పోందిన మూడు గ్రామాలకు చెందిన 15మందికి పైగా రైతులు..?
- వక్ఫ్ భూములను రైతులు దర్జాగా సాగు చేసుకొంటున్న వైనం
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు..?

2లో

### స్వర్ణాంధ్ర -2027 లక్ష్య సాధనదిశగా
# జిల్లా అభివృద్ధికి ప్రణాళికలు

- నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి


2లో
అధికారుల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

# కర్నాటక మద్యం సరఫరా పై రగడ

- కందుకూరు గ్రామంలో ఇరువర్గాలు ఘర్షణ
- ఇరువర్గాలకు గాయాలు
- ఇరువర్గాల పై కేసు నమోదు
- కందుకూరు గ్రామంలో ఇరువర్గాలు హల్‌చల్
- భయాందోళనలో గ్రామస్తులు

2లో



**G.PULLA REDDY ENGINEERING COLLEGE (Autonomous) : KURNOOL–518 007**
Accredited by NBA and NAAC
Estd : 1985 Ph : 08518-270957

**I B.Tech - APEAPCET -2024 - SPOT ADMISSIONS**

A few seats are vacant in I B.Tech. Eligible and interested candidates may appear for spot admissions on **24.09.2024 at 10.00 A.M** in the college premises along with original certificates.

These admissions will be made as per the guidelines issued by the Convener, APEAPCET -2024 and subject to ratification by the competent authority.

Candidates admitted in Spot Admissions are not eligible for Fee Reimbursement. - PRINCIPAL

# నంద్యాల బదిలీలపై వైసీపీ ముద్ర!

(మొదటి పేజీ తరువాయి)

ప్రజా ప్రతినిధుల సిఫారసుల్లో కొన్ని పోస్టులకు జిల్లా అధికారులు మొండి చెయ్యి ఇచ్చారు. ఇదే అంశం ఇప్పుడు జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. జిల్లా, రాష్ట్ర, జోనల్ స్థాయి ఉన్నతాధికారులు పరిపాలన పరమైన అంశాన్ని ప్రధాన బూచిగా చూపిస్తున్నారు. ప్రజా ప్రతినిధులకు మాట మాత్రం చెప్పకుండా కొన్ని శాఖల్లో ప్రతిపాదనలను ప్రక్కన పెట్టి బదిలీలను పూర్తి చేశారు. జిల్లాలో రెవెన్యూ శాఖలో ప్రజాప్రతినిధుల ప్రతిపాదనకు పెద్ద ఎత్తున మొండి చెయ్యి చూపించారు. జిల్లాకు చెందిన మంత్రుల ప్రతిపాదనలను ప్రక్కన పెట్టి పోస్టింగ్ లను ఇచ్చారు. జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు ఆయా శాఖల ఉన్నతాధికారుల పై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది. నంద్యాల జిల్లాలో రెవెన్యూ శాఖలో కలెక్టరేట్ లో పని చేస్తున్న కీలక అధికారి ఒకరు బదిలీల్లో తనదైన ముద్రను వేశారు. ఆయన గతంలో జిల్లాలో పని చేసిన స్థానాల్లో తన అనుయాయులకు పెద్ద పీట వేస్తూ పోస్టింగ్ లను ఇచ్చినట్లు రెవెన్యూ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతుంది. రెవెన్యూశాఖలో కీలకమైన రెవెన్యూ అసోసియేషన్ లో పాత, కొత్త రెవెన్యూ అసోసియేషన్లు ఢీ అంటే ఢీ అంటున్నట్లు స్పష్టంగా కనిపిస్తుంది. గతంలో రెవెన్యూ అసోసియేషన్ లో కీలకంగా వ్యవహరించిన వారిని కోరుకున్న స్థానాల నుంచి దూరం చేయడంలో రెవెన్యూ అసోసియేషన్ విజయం సాధించిందనే చెప్పాల్సి వస్తుంది. ప్రస్తుతం రెవెన్యూ అసోసియేషనలో కీలకంగా ఉన్న అధికారులు తాము కోరుకున్న స్థానాలను పదిలం చేసుకున్నారు. సబ్ రిజిస్ట్రర్ కార్యాలయాల్లో ఆయా ప్రజా ప్రతినిధులు ఇచ్చిన సిఫారసులను కాకుండా పోస్టింగ్ లు ఇచ్చారు. రిజిస్ట్రేషన్ శాఖలోని జోనల్ స్థాయి అధికారి తనదైన ముద్రను బదిలీల్లో చూపించారు. ఆ శాఖ అసోసియేషన్ ముద్ర బదిలీల్లో స్పష్టంగా కనిపిస్తున్నట్లు ఆ శాఖలోని ఉద్యోగులు బహిరంగంగానే చెబుతున్నారు. మున్సిపాలిటిలో అదే తంతు కొనసాగింది. ప్రజా ప్రతినిధులు ఇచ్చిన ప్రతిపాదనలను ప్రక్కన పెట్టడం ఒకవంతయితే తాము కోరుకున్న వారిని ఆ శాఖ రీజనల్ కార్యాలయ ఉన్నతాధికారులు ఆయా మున్సిపాలిటిలకు పంపి తమ ముద్రను స్పష్టంగా వేశారు. మొత్తం మీద జిల్లాలో బదిలీల అంశం వివాదాస్పదంగా మారడంతో మంత్రులు మొదలుకొని ఎమ్మెల్యేలు రాష్ట్ర, జోనల్, జిల్లా స్థాయి ఉన్నతాధికారులకు తమ నిర్ణయాన్ని స్పష్టం చేసేందుకు నిర్ణయించుకున్నట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది.

## రాష్ట్రాభివృద్ధి కోసం ప్రజల భాగస్వామ్యంతో స్వర్ణాంధ్ర

(మొదటి పేజీ తరువాయి)

జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు.సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో స్వర్ణాంధ్ర @2047 పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర @2047 విజన్ అనేది ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు కోసం సాధించేందుకు రూపొందించబడిన ప్రతిష్టా త్మకమైన దార్శనిక పత్రం అని తెలిపారు. ఇది సాకారం కావాలంటే ప్రజలందరి భాగస్వామ్యం అవసరమని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోందన్నారు. ఇందుకోసం ప్రజల అభిప్రాయాలను సేకరించడం జరుగుతోందన్నారు.ప్రజలకు మరింత మెరుగైన సేవలందించేందుకు వీలుగా స్వర్ణాంధ్ర విజన్ – 2047 ప్లాన్ పై ప్రభుత్వానికి సూచనలు, అభిప్రాయాలను అందచేయాలని కలెక్టర్ ఈ సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. స్మార్ట్ ఫోన్ నుండి.. http://swarnandhra.ap.gov.in/ Suggestions లింక్ తో వచ్చే QR కోడ్ స్కాన్ చేయడం ద్వారా మీ ఆలోచనలు,సలహాలను పంచుకుని.. ముఖ్యమంత్రి, ఫోటోతో పాటు సంతకంతో కూడిన సర్టిఫికేట్ ను స్వీకరించాలని కలెక్టర్ తెలిపారు.

**QR కోడ్ ని స్కాన్ చేసే విధానం :** పేరు నమోదు చేయండి, మొబైల్ నంబర్ ను నమోదు చేయండి (ఓటిపి మొబైల్ కి పంపబడుతుంది)3ని నమోదు చేయండి మరియు ధృవీకరించండి, జిల్లాను నమోదు చేయండి, వయస్సును నమోదు చేయండి, లింగాన్ని నమోదు చేయండి, వృత్తిని నమోదు చేయండి, ఇ-మెయిల్ చిరునామాను నమోదు చేయండి.

## కర్ణాటక మద్యం సరఫరాపై రగడ

**కోసిగి మేజర్ న్యూస్:** అక్రమ కర్ణాటక మద్యాన్ని తరలిస్తూ మేమే తరలించాలి..మేమే సరఫరాచేస్తాం.. లేకపోతే మీ అంతు చూస్తాం..లేదు మీ అంతు చూస్తామంటూ.. ఇరువర్గాల మధ్య పెద్ద ఘర్షణ కోసిగి మండలంలోని కందుకూరు గ్రామంలో చోటుచేసుకొంది. కొతాళం మండలం తిప్పలదొడ్డి గ్రామానికి చెందిన కొంతమంది, కందుకూరు గ్రామానికి చెందిన కొంతమంది మద్య కర్ణాటక మద్యం బాక్సుల సరఫరాపై మాటమాటపెరిగి ఒకరిపై ఒకరు దాడులు చేసుకోవడంతో ఇరువర్గాలకు తలకు, చేయికి బలమైన గాయాలు అయ్యాయి. కందుకూరు గ్రామానికి చెందిన కొంతమంది కర్ణాటక మద్యం సరఫరాదారులు తిప్పలదొడ్డి గ్రామానికి తరలించవద్దు అంటూ కడదొడ్డి గ్రామానికి చెందిన అక్రమ కర్ణాటక మద్యం సరఫరాదారుడిపై కందుకూరు గ్రామానికి చెందిన అమ్మకం దారులు హుకుం జారీచేయడం జరిగింది. తిప్పలదొడ్డి గ్రామానికి మద్యాన్ని సరఫరాచేస్తే నీ అంతు చూస్తామని కడదొడ్డి గ్రామానికి చెందిన సరఫరాదారున్ని బెదిరించడంతో తిప్పలదొడ్డి గ్రామానికి చెందిన వ్యక్తులకు ఫోన్ చేసి ఆ అమ్మకందారుడు సమాచారం ఇవ్వడం జరిగింది. అలాగే తిప్పలదొడ్డి గ్రామానికి కర్ణాటక మద్యం తరలిస్తున్న సమయంలో అదే గ్రామానికి చెందిన కర్ణాటక మద్యందారులు అడ్డగించి వారిపై ఆదివారం దాడిచేసినట్లు సమాచారం. దీన్ని సహించని తిప్పలదొడ్డి గ్రామానికి చెందిన కర్ణాటక మద్యందారులు సోమవారం కందుకూరు గ్రామానికి దాడిచేసినవారిపై వారితో వాదోపవాదాలకు దిగి ఒకరిపై ఒకరు కారంపొడి, బండిగూటాలు, వేటకొడవళ్ళతో దాడిచేసుకోవడం జరిగింది. ఈవిషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్ళి ఇరువర్గాలను చెల్లాచెదురు చేయడంతో కొంతవరకు శాంతించారు. ఇరువర్గాలకు సర్ది చెప్పడంతో పరిస్థితి శాంతియుతంగా మారింది. ఈసంఘటనపై కందుకూరు గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. కొంతమంది పోలీసుల అదుపులో ఉన్నట్లు మరికొంతమంది ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలివెళ్ళినట్లు తెలిసింది. ఈవిషయంపై యస్ఐ చంద్రశేఖర్ వివరణ కోరగా ఇరువర్గాలపై కేసునమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

# పేదల ఆకలి తీర్చేందుకే అన్న క్యాంటీన్ల ఏర్పాటు

(మొదటి పేజీ తరువాయి)

ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రివర్యులు టి.జి. భరత్ ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం లోకి రాగానే అన్న క్యాంటీన్ ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిందన్నారు.కర్నూలు నియోజకవర్గంలో పేదలకు అవసరమైన ప్రదేశాలలో 3 అన్న క్యాంటీన్ లు ఏర్పాటు చేశామని, ఇందులో 2 అన్న క్యాంటీన్ లను ఈ రోజు ప్రారంభించామని తెలిపారు. త్వరలో స్థానిక ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో మరొక అన్న క్యాంటీన్ ను ప్రారంభిస్తామన్నారు. పేద ప్రజల కడుపు నింపేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్న క్యాంటీన్ ల ద్వారా కేవలం 5రూపాయలకే నాణ్యతతో కూడిన అల్పాహారం,మధ్యాహ్నం, రాత్రి భోజనం అందచేస్తోందన్నారు. .గత ప్రభుత్వం లో అన్న క్యాంటీన్ లను తీసివేయడంతో పేద ప్రజలు చాలా ఇబ్బంది పడ్డారన్నారు. ప్రజలకు మేలు చేకూరే విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం మంచి ప్రభుత్వమని మంత్రి తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. స్వర్ణాంధ్ర 2047 సాధించేందుకు రాష్ట్ర,కేంద్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు.

**కర్నూలు నగరంలో 5 అన్న క్యాంటీన్లు ..కలెక్టర్ :**

జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కర్నూలు నగరంలో 5 అన్న క్యాంటీన్ లను ఏర్పాటు చేస్తున్నామని, ఇప్పటి వరకు 4 అన్న క్యాంటీన్లను ప్రారంభించామని తెలిపారు. కల్లూరు పరిధిలోని పరిమళ నగర్, సెట్కూర్ కార్యాలయం వద్ద, కలెక్టరేట్ ఆవరణలో, పాతబస్టాండ్ కొండారెడ్డి బురుజు సమీపంలో మొత్తం 4 క్యాంటీన్లను ప్రారంభించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.అవసరమైన పనుల కోసం నగరానికి వచ్చే పేదలకు అన్న క్యాంటీన్ ల ద్వారా 5 రూపాయలకే ఆహారం అందించడం వల్ల ఆకలి తీరడం తో పాటు డబ్బు ఆదా అవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.తొలుత అన్న క్యాంటీన్ లను ప్రారంభించిన అనంతరం మంత్రి, కలెక్టర్ స్వయంగా ప్రజలకు అల్పా హారాన్ని వడ్డించడంతో పాటు వారితో కలిసి అల్పాహారాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్ రవీంద్ర బాబు, తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణాంధ్ర–2047 లక్ష్య సాధన దిశగా జిల్లా అభివృద్ధికి ప్రణాళికలు

**నంద్యాల కల్చరల్, మేజర్ న్యూస్ :** స్వర్ణాంధ్ర–2047 దార్శనికపత్ర రూపకల్పన లో భాగంగా జిల్లాను అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు సమగ్ర ప్రణాళికలను రూపొందించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి జిల్లా, మండల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని సెంటినరీ హాల్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా ప్రణాళికపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఆర్వో పద్మజ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని కీలక రంగాలపైన దృష్టి సారించి జిల్లా అభివృద్ధి ప్రణాళికలను తయారు చేయాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో గ్రామయ సభలు నిర్వహించి విజన్ అభివృద్ధి రూపకల్పనపై చర్చించడంతో పాటు కరపత్రాలు, పోస్టర్ల ద్వారా ఇంటింటికి సమాచారం అందించి అవగాహన కల్పించాలన్నారు. ప్రజలు, రైతులు, యువత నుంచి ఫీడ్ బ్యాక్ సేకరించి జిల్లా అభివృద్ధి ప్రణాళికలో భాగస్వాములను చేయాలన్నారు. సహాయ గణాంక అధికారులు ఎంపీడీఓలకు సహకారం అందించి మంచి ప్రణాళికతో డాక్యుమెంట్ రావాలని సూచించారు. వంద రోజులలో సాధించిన విజయాలపై ఇది మంచి ప్రభుత్వం లోగోను ప్రతి ఇంటికి సచివాలయ సిబ్బంది ద్వారా చేరవేయాలన్నారు. నిర్దేశించిన రోజువారి లక్ష్యాన్ని పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. క్షేత్రస్థాయి సిబ్బంది పనితీరుపై జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు ఎందుకు పర్యవేక్షణ చేయలేకపోతున్నారని చెబితే తప్పవ పనులు చేయరా అని కలెక్టర్ ప్రశ్నించారు. అనంతరం స్వర్ణాంధ్ర 2047 పోస్టర్ ను ఆవిష్కరించారు.

## ఉర్దూ యూనివర్సిటీలో స్వచ్ఛత హి సేవా ప్రతిజ్ఞ

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్ న్యూస్:** గాంధీ జయంతిని పురస్కరించుకొని ఈ నెల 17వతేదీ నుంచి అక్టోబర్ 2వతేదీ వకు స్వచ్ఛత హి సేవా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం నగరంలోని ఉర్దూ యూనివర్సిటీలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.యూనివర్సిటీ ఇన్ చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.మహబూబ్ బాషా మాట్లాడుతూ స్వచ్ఛతా అందరి బాధ్యత అన్నారు. మన పరిసరాలను మనం పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వెంకటప్ప, పాల్ కృపాకర్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## కంభళదిన్నేలో వక్ఫ్ బోర్డు భూములు హాంఫట్..!

**పెద్దకడుబూరు మేజర్ న్యూస్ :**

పెద్దకడుబూరు మండల పరిధిలోని కంభళదిన్నే గ్రామంలో కొంతమంది అక్రమార్కుల వల్ల వక్ఫ్ బోర్డుకు సంబంధించిన భూములు మాయమవు తున్నాయి.అప్పట్లో రెవెన్యూ అధికారుల పర్యవేక్షణ, పరిశీలన లేకపోవడంతోనే ఈభూములుపై కొంత మంది అక్రమార్కులు కన్నుపడింది. దీంతో కబ్జా దారులు అందులో వ్యవసాయం చేసుకుంటూ లబ్ధి పొందుతున్నారన్న విమర్శలు బలంగా విని పిస్తు న్నాయి.అక్రమణదారులు అభ్యంతరం వ్యక్తం చేసేవారిని. మచ్చిక చేసుకొని ఎంచక్కా భూములను ఆక్రమించుకున్నారని తెలుస్తోంది. కంభళదిన్నే గ్రామంలో సర్వే నెంబరు 178ఎలో 61-01ఎకరాలు భూమి ఉందని అలాగే అదే సర్వే నెంబరులో178సిలో 8-70ఎకరాలు భూమి మొత్తం కలిపి 69-71 ఎకరాల భూమి వక్ఫ్ బోర్డుకు సంబంధించిన భూములు ఉన్నాయి. అయితే 1992వసంవత్సరంలో కొంతమంది విఎఓలు .రెవెన్యూ అధికారులు నిర్వాహకం వల్లనే భూములు కనిపించకుండా అదృశ్యం అయ్యాయనే ఆరోపణలు ఉన్నాయి.అప్పటి నుంచి కంభళదిన్నే, కల్లుకుంట, కామవరం, గ్రామాలకు చెందిన 15మంది రైతులు ఓకొక్కరు మూడు ఎకరాల నుంచి 5ఎకరాల వరకు దర్జాగా అక్రమించు కొని వ్యవసాయాన్నిసాగు చేసుకుంటున్నారు.గత కొన్నేళ్లుగా అధికారులు ఈభూకబ్జాలపై సర్వే నిర్వహించలేదు. వీటిపై రెవెన్యూ అధికారులకు ఏలాంటి పరిశీలన లేకుండా పోయింది. ఈతతంగంపై ఇప్పటికైనా జిల్లా.మండల స్థాయి రెవెన్యూ అధికారులు స్పందించాలని మైనార్టీ ప్రజలు కోరుకుంటున్నారు. కంభళదిన్నే గ్రామంలో సర్వే చేపడితే మరిన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. కంభళదిన్నే గ్రామంలో ఉన్నతాధికారులు ఈ భూములపై సమగ్ర సర్వే చేపట్టి వక్ఫ్ బోర్డు భూములను పరిరక్షించాలని పలువురు ముస్లీం మైనార్టీ నాయకులు. గ్రామస్తులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

## వెల్దుర్తి ఐసిడిఎస్ కార్యాలయంలో పౌష్టిక ఆహార మహోత్సవాలు

**వెల్దుర్తి మేజర్ న్యూస్:** మండల కేంద్రమైన వెల్దుర్తి పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయంలో పౌష్టిక ఆహార మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. సోమవారం వెల్దుర్తి క్రిష్ణగిరి మండలాల అంగన్వాడి హెల్పర్స్ అందరూ పాల్గొని వివిధ పౌష్టిక ఆహారం వంటలు చేయించారు. పౌష్టిక ఆహారం మంచిగా వండిన వారిని 14 మంది ని ఎన్నుకొని సత్కరించడం జరిగిందని సిడిపిఓ లుక్ తెలిపారు. వెల్దుర్తిలో గత 22 రోజుల నుండి వివిధ సెంటర్లలో పౌష్టిక ఆహార మహోత్సవాలు ఘనంగా నిర్వహించామని తెలిపారు.బాలింతలు, చంటి పిల్లలు, గర్భవతులు పౌష్టిక ఆహారం తీసుకోవడం వలన విటమిన్లు పుష్కలంగా ఉంటాయని విటమిన్ వలన తల్లి పిల్లలు సురక్షితంగా ఉంటారని, అంగన్వాడీల హెల్పర్స్ అందరికీ తెలియజేయాలని సూపర్వైజర్ సరస్వతి, అంగన్వాడి హెల్పర్స్ కు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రిష్ణగిరి, వెల్దుర్తి మండలాల నుంచి వివిధ గ్రామాల ఆయాలు పాల్గొన్నారు.



# గిరిజనుల సమస్యలపై కలెక్టర్‌కు వినతి

**మహానంది, మేజర్‌న్యూస్ :** మహానంది సమీపంలోని తెలుగుగంగ కాల్వ సమీపంలో ఉన్న చెంచులక్ష్మిగూడెం గిరిజన ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలంటూ నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియాకు వినతి పత్రాన్ని అందజేశారు. సోమవారం నంద్యాల కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సమస్యల పరిష్కార వేదికలో బిసి, ఎస్సీ సంఘాల నాయకులతో కలసి వెళ్లి ఆమెకు వినతి పత్రం అందజేశారు. తమ గూడెం సమస్యలను పరిష్కరించాలని కోరారు. గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం ఆర్‌ఓఎఫ్‌ఆర్ క్రింద భూములు అందించారని, అవి సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని గూడెం అధ్యక్షులు చలం చలం శ్రీనివాసులు తెలిపారు. అయితే ఇక్కడ బోర్లు బిగించుకునేందుకు విద్యుత్‌స్తంభాలను ఏర్పాటు చేసుకుంటుండగా అటవీ రేంజర్ అడ్డుకుంటున్నారన్నారు. పొలాల్లో పంటలు బాగా పండి చేతికి వచ్చే సమయంలో నీళ్ళు కట్టుకునేందుకు విద్యుత్‌ను ఏర్పాటు చేసుకుంటుండగా అటవీ అధికారులు


కలెక్టర్ కార్యాలయం వద్ద గిరిజనులు నిరసన తెలుపుతున్న దృశ్యం

వేధిస్తున్నారని వారు ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. సమస్య పరిష్కరించకుంటే పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోతామన్నారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ తమ సమస్యను పరిష్కారించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపినట్లు వారు తెలిపారు. వీరి వెంట లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

## నిర్ణీత సమయంలో అర్జీలు పరిష్కరించాలి


వినతులు స్వీకరిస్తున్న దృశ్యం

**కర్నూలు నగరం, మేజర్‌న్యూస్:** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వచ్చే అర్జీలను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని నగర పాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అధికారులను ఆదేశించారు. సోమవారం నగర పాలక కార్యాలయంలో నిర్వహించిన ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమానికి 21అర్జీలు వచ్చాయి. ప్రజల నుంచి వినతులు స్వీకరించిన కమిషనర్ వారి సమస్యలను అడిగి తెలుసుకొని వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలు అధికంగా తమ తమ కాలనీల్లో రహదారులు, డ్రైనేజీ కాలువలను నిర్మించాలని వినతులు అందజేసినట్లు తెలిపారు. వర్షపు నీరు నిల్వ నిలిచి దోమలు అధికమవుతుందని అర్జీలు అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రజల వినతులను సకాలంలో పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య అధికారి విశ్వేశ్వరరెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ఆర్ఐ జునైద్, టిడ్కో అధికారి పెంచలయ్య, టీపీఆర్వో వెంకటలక్ష్మి, ఏసీపీ మంజులత, డీపీవో ఉమేష్ పాల్గొన్నారు.

## ప్రజల సంరక్షణే మాకు ముఖ్యం

**జూపాడుబంగ్లా, మేజర్‌న్యూస్ :** ప్రజల సంరక్షణే మాకు ముఖ్యమని మండల పరిధిలోని పారుమంచాల గ్రామంలోని వైసీపీ నాయకులు, వార్డు మెంబర్లు నిరూపించుకున్నారు. గ్రామానికి త్రాగునీటి సరఫరా చేస్తున్న బావిలో చెత్తా, చేదారం పేరుకుపోయి ఉండటంతో విషయాన్ని గ్రామస్తులు వైసీపీ నాయకులు హేమశేఖర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్ళడంతో స్పందించి గ్రామంలో ఉన్న వైస్ సర్పంచ్ సల్లా శేఖర్‌రెడ్డి బావిలో ఉన్న చెత్తను తొలగించాలని చెప్పడంతో ఉప సర్పంచ్, వార్డు మెంబర్లు జాకీర్ హుసేన్, జనార్ధన్‌రెడ్డి, పాల రాము, వార్డు ఇన్‌చార్జి లోకేశ్వరరెడ్డి, తలారీ శివ అందరూ కలసి సోమవారం గ్రామానికి నీటి సరఫరా చేసే బావిలో ఉన్న చెత్తను స్వయంగా తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయాలు మాకు ముఖ్యం కాదు గ్రామ ప్రజల సంరక్షణే మాకు ముఖ్యమన్నారు. అనంతరం గ్రామ ప్రజలు వారిని అభినందించారు.


త్రాగునీటి బావిలో ఉన్న చెత్తను తొలగిస్తున్న దృశ్యం

## సంక్షోభంలోనూ సంక్షేమం.. ఇది మంచి ప్రభుత్వం


హెబ్బటంలో అధికారులు, నాయకులు

**హొళగుంద, మేజర్‌న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం సంక్షోభంలోనూ సంక్షేమం చేపడుతుందని ఇది మంచి ప్రభుత్వం అని టీడీపీ నాయకులు,అధికారులు ప్రజలకు చెప్పారు.పార్టీ తాలూక ఇమ్‌చార్జ్ వీరభద్రగౌడ ఆదేశాల మేరకు సోమవారం మండల పరధిలోని హెబ్బటం గ్రామంలో ప్రభుత్వం వంద రోజుల కార్యాక్రమంపై గ్రామ సర్పంచ్ కృష్ణవేణి,స్పెషళ్ ఆధికారి శ్రీనివాసులు,గ్రామ కార్యాదర్శి రాజశేఖర్ ఆధ్వర్యంలో గ్రామంలోని ఇంటింటా తిరిగి స్టిక్కర్లు అంటించారు.రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు ప్రజలకు అన్ని విదాలుగా అభవృద్ధి చేస్తారని ప్రజలకు చెప్పారు.ఈ కార్యక్రమంలో గ్రామ కమిటి నాయకులు ఈరన్న, పక్కిరప్ప, లక్ష్మయ్య, వన్నూరప్ప, శ్రీనివాసులు, లక్ష్మిరెడ్డి పాల్గొన్నారు. ఆదేవిధంగా హొళగుందలో కూడా జంగాలి రామాంజనేయులు ఇంటింటా కార్యక్రమం నిర్వహించారు.

## క్రైమ్ స్పాట్

### అనుమానస్పద స్థితిలో మహిళ మృతి

**ఓర్వకల్లు మేజర్ న్యూస్ :** అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని గుట్టపాడు గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై తెలిపిన వివరాల మేరకు గుట్టపాడు గ్రామానికి చెందిన గూడెం అరుణ వయస్సు 25 సంవత్సరాలు భర్త రమేష్ ఆదివారం సాయంత్రం ఆమె తన ఇంటిలో స్పృహ లేకుండా క్రిందపడి ఉండగా గమనించిన భర్త మరియు ఇంటి పక్కన వారు కర్నూలు ప్రభుత్వాసుపత్రికి ఆటోలో తరలించగా అక్కడ వైద్యులు పరీక్షించి చనిపోయిందని చెప్పినారని మృతురాలి తల్లి గూడెం శ్యామల తన కూతురు అనుమానస్పద రీతిలో మరణించిందని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు మృతురాలికి కుమారుడు కుమార్తె సంతానం.



### కర్ణాటక మద్యం పట్టివేత

**హొళగుంద, మేజర్‌న్యూస్ :** హొళగుంద గ్రామానికి చెంది బకాడి గంగాధర్ వద్ద సోమవారం కర్ణాటక మధ్యంను పట్టుకున్నట్లు ఎస్ఐ బాలనరసింహులు తెలిపారు.కర్ణాటక కె.బెళగల్ నుండి మోటార్ బైక్ మీదగా హొళగుందకు వస్తుండగా నీళ్ళ ట్యాంక్ వద్ద సిబ్బందితో కలిసి పట్టుకున్నట్లు తెలిపారు.96 టెట్రా ప్యాకెట్లుతో పాటు మోటార్ బైక్‌ను స్వాధీనం చేసుకుని కేసును నమోదు చేసినట్లు చెప్పారు.నిందితుని రిమాండ్ కోరకు ఆలూరుకోర్టుకు హజర్ పరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

### పేకాటరాయుళ్ల అరెస్ట్

**అవుకు, మేజర్‌న్యూస్:** అవుకు మండలం మెట్టుపల్లె గ్రామ పొలిమేరలో జి.ఎన్.ఎస్.ఎస్ కెనాల్ కాలువ దగ్గర ఉన్న కంపచెట్ల క్రింద బహిరంగ స్థలంలో కొంత మంది పేకాట అందర్– బహార్ ఆడుతున్నారని రాబడిన సమాచారం మేరకు అవుకు పోలీసులు, ఎస్.ఐ ఎం. రాజారెడ్డి మరియు వారి సిబ్బంది వారిని పట్టుకొని గోకు చెన్నయ్య, గుండ్ల శింగవరం గ్రామము సుగాలి తిరుమల నాయక్ అవుకు గ్రామము, మక్కాల నటరాజు అవుకు గ్రామం, మల్లయ్య గారి మహేశ్వర రెడ్డి చెన్నంపల్లె గ్రామము, పలగారి జగదబి రాముడు, సింగనపల్లి, బసిరెడ్డి గారి శివ రెడ్డి చెన్నంపల్లి ఇంకా 4గురుని ఎస్.ఐ రాజారెడ్డి అరెస్టు చేసి వారి నుండి 9500 రూపాయలు పేకక ముక్కలను స్వాధీనం చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

### వ్యక్తి మృతి

**ఆస్పరి, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని ముత్తుకూరు గ్రామానికి చెందిన ఉప్పర లక్ష్మన్న(24) బైకుపై నుంచి కిందపడి గాయపడగా, ఆదోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ, సోమవారం మృతి చెందినట్లు సిఐ మస్తాన్ వలి తెలిపారు. లక్ష్మన్న మండలంలోని కైరుప్పుల నుంచి తన భార్య స్వగ్రామమైన వెంగళాయదొడ్డికి రెండు రోజుల క్రితం బైకు నడుపుతూ, కిందపడి గాయపడ్డాడు. స్థానికంగా గ్రామంలోని ప్రైవేట్ వైద్యులతో ప్రథమ చికిత్స తీసుకున్న పరిస్థితి విషమించడంతో ఆదోని ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడని సిఐ తెలిపారు. మృతుడికి భార్య పద్మావతి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని ధర్యాప్తు చేస్తున్నట్లు సిఐ సూచించారు.

### చింతలాయపల్లెలో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించిన సి.ఐ

**కొలిమిగుండ్ల, మేజర్‌న్యూస్ :** కొలిమిగుండ్ల మండల పరిధిలోని చింతలాయపల్లె, అంకిరెడ్డిపల్లె గ్రామాల్లో సి.ఐ ఎం. రమేష్ బాబు ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం 4గంటలకు స్పెషల్ పార్టీ పోలీసులు మరియు కొలిమిగుండ్ల పోలీసు స్టేషన్ సిబ్బందితో కలిసి ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సి.ఐ రమేష్ బాబు మాట్లాడుతూ గ్రామంలో ప్రజలు ప్రశాంత జీవనానికి భంగం కలిగిస్తే అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. అలాగే మండలంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో ప్రజలు ఘర్షణలకు దూరంగా ఉండాలని అలా కాదని గొడవలకు పాల్పడితే జైలుపాలై కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తుందని దీనిని దృష్టిలో పెట్టుకొని శాంతియుతంగా జీవించాలని ఆయన తెలిపారు.

## అనుమానించాడనే హత్య చేశారు : డీఎస్పీ

- ముద్దాయిలు అరెస్టు.. రిమాండ్‌కు తరలింపు
- హత్యకేసును చేధించిన సిఐ సురేష్‌కుమార్‌రెడ్డిని అభినందించిన పోలీసు అధికారులు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్:** భార్యతో మాట్లాడడం చూసి భార్యను అనుమానించి గొడవపడ్డాడనే నెపంతోనే భర్తను హత్యచేశారని డిఎస్సీ రామాంజి నాయక్ తెలిపారు. సోమవారం స్థానిక డిఎస్పి కార్యాలయంలో పాత్రికేయుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిఎస్సీ రామాంజి నాయక్ మాట్లాడుతూ పాములపాడు మండలం ఎర్రగూగూడూరు గ్రామానికి చెందిన శివమ్మ తన భర్త సిద్దయ్య కనిపించడం లేదని పాములపాడు పోలీసు స్టేషన్‌లో ఈనెల 14వ తేదిన ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. భార్య శివమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తుండగా సిద్దయ్య కొర్రప్రోలు హెడ్ కెసి బ్రిడ్జి వద్ద నీళ్లలో శవమై తేలాడు. దీంతో సిద్దయ్య కేసును అనుమానస్పద మృతిగా నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేయడం జరిగిందన్నారు. ఎర్రగూడూరు


ముద్దాయిల అరెస్టును చూపిస్తున్న డిఎస్సీ రామాంజి నాయక్

గ్రామానికి చెందిన మేగల సురేష్, సిద్దయ్య భార్య శివమ్మతో మాట్లాడుతున్నాడనే అనుమానంతో భార్యతో గొడవపడడం జరిగిందన్నారు. ఈ విషయం తెలిసిన సురేష్ అదే గ్రామానికి చెందిన సుంకేసుల అశోక్ కుమార్‌తో కలిసి ముగ్తురు కెసి కెనాల్ వైపు మద్యం సేవించేందుకు సిద్దయ్యను తీసుకెళ్ళి గొడవపడుతూ బండరాయితో కొట్టి కెనాల్లో వేయడం జరిగిందని విచారణలో తేలిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని సిద్దయ్యను హత్యచేసిన మేగల సురేష్, సుంకేసుల అశోక్ కుమార్‌లను రూరల్ సిఐ సురేష్ కుమార్ రెడ్డి, పాములపాడు ఎస్ఐ సురేష్ బాబు, సిబ్బందితో కలిసి భానుముక్కల టర్నింగ్ వద్ద మధ్యాహ్నం అరెస్టు చేడయడం జరిగిందన్నారు. వీరిని కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించడం జరిగిందని తెలిపారు. ఎంతో చాకచక్యంగా హత్యకేసును చేధించిన రూరల్ సిఐ సురేష్ కుమార్ రెడ్డి, పాములపాడు ఎస్ఐ సురేష్ బాబు, ఎఎస్ఐ ఏసన్న, కానిస్టేబుల్ ఖాజా, రసూల్‌లను జిల్లా ఎస్పి, డిఎస్సీలు అభినందించారు.

సూర్య
మంగళవారం | 24 సెప్టెంబర్ 2024

# కొక్కరచేడులో ఏకోపాధ్యాయ పాఠశాల

## 88 మంది విద్యార్థులకు ఒక్కరే ఉపాధ్యాయుడు



కొక్కరచేడులో మండల ప్రాథమిక పాఠశాల

**హాలహర్వి, మేజర్‌న్యూస్:** హాలహర్వి మండలంలోని కొక్కర చేడు గ్రామంలో ఉన్న మండల ప్రాథమిక పాఠశాలలో 88 మంది విద్యార్థులు ఒకటి నుండి 5 తరగతుల వరకు ఒకే ఒక్క ఉపాధ్యాయుడు పాఠాలు చెబుతున్నారు. గ్రామంలో ఒకప్పుడు బిసి వసతి గృహం ఉండేది.దానిని కూడా అధికారులు మూసివేశారు. విద్యార్థులు తక్కువ స్థాయిలో ఉండడంతో ఉపాధ్యాయులు కూడా ఒక్కరినే నియమించారు. మిగిలిన ఉపాధ్యాయులు డిప్యుటేషన్ పై ఇతర పాఠశాలలో బోధన చేస్తున్నారు. ఒక్క ఉపాధ్యాయుడు రాకుంటే ఆ రోజు పాఠశాలకు సెలవు వచ్చినట్లే. మండల అధికారులు ఉపాధ్యాయుడు రాని సమయంలో వేరొక గ్రామానికి చెందిన ఉపాధ్యాయులును పంపి పాఠాలు బోధిస్తున్నారు. ఇప్పటికయినా విద్యార్థులకు తగ్గట్టు ఉపాధ్యాయులను నియమించాలని గ్రామస్థులు కోరుతున్నారు.


పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు

# సీఎం రిలీఫ్ ఫండ్‌కు చెక్కు అందజేత


చెక్కును అందజేస్తున్న దృశ్యం

**కల్లూరు, మేజర్‌న్యూస్:** నగరంలోని శ్రీరామ అగ్రో ఏజెన్సీస్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత సీఎం సహాయ నిధికి రూ.లక్ష విరాళం అందజేశారు. సోమవారం పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి స్వగృహంలో ఆమెను కలిసి రూ.లక్ష చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విజయవాడ వరద బాధితులను ఆదుకోవడానికి ముందుకు వస్తుండటం అభినందనీయమన్నారు.

# రహదారులపై వర్షపు నీటిని తొలగించండి

**కర్నూలు నగరం, మేజర్‌న్యూస్:** నగరంలోని రహదారులపై నిలిచిన వర్షపు నీటిని వెంటనే తొలగించాలని నగర పాలక సంస్థ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అన్నారు. సోమవారం నగరంలో కురిసిన వర్షంతో నీటి నిల్వలకు ఆస్కారం లేకుండా అధికారులను కమిషనర్ అప్రమత్తం చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా రహదారులు, మురుగు కాలువల్లో నీరు నిల్వల తొలగింపుకు సంబంధించి పనులను కమిషనర్ పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. రహదారులపై నీటి నిల్వలను తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఈ గిరిరాజు, ట్రైనీ ఏఈ స్వాతి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు వలి, లోకేష్ పాల్గొన్నారు.


పరిశీలిస్తున్న కమిషనర్

# మా ఊరికి బస్సు వచ్చింది




**ఓర్వకల్లు మేజర్ న్యూస్ :** ఎమ్మెల్యే చొరవతో మా ఊరికి బస్సు వచ్చిందని మండల పరిధిలోని పాలకొల్లు చింతలపల్లె గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు పాలకొల్లు సుధాకర్ రెడ్డి చింతల పల్లె సర్పంచ్ వెంకటరమణ లో మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరా లుగా బస్సు సౌకర్యం లేక గ్రామ ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకుని పోగా అందుకు స్పందించి మాగ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని అన్నారు. సోమ వారం గ్రామానికి ఆర్టిసి బస్సు రాగా గ్రామస్తులు బస్సుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# సంక్షేమం దిశగా కూటమి ప్రభుత్వం

## నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్



**ఓర్వకల్లు మేజర్ న్యూస్ :** గత ప్రభుత్వం రాష్ట్రాన్ని సంక్షోభంలో నెట్టేస్తే నేడు కూటమి ప్రభుత్వం సంక్షేమం దిశగా అడుగులేస్తుందని నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని హుసేనాపురం గ్రామంలో గ్రామ సర్పంచ్ చంద్ర గోవర్ధనమ్మ అధ్యక్షతన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి హాజరై వందరోజుల పాలన గురించి ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుండి చంద్రబాబు అభివృద్ధి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారని అర్హులైన వారికి సంక్షేమ పథకాలను అందిస్తామని గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించుకుందామని అన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే పింఛన్ మూడు వేల నుంచి 4000 పెంచడం అన్న క్యాంటీన్ ద్వారా ఐదు రూపాయలకే కడుపునిండా భోజనం అందిస్తున్నారని అన్నారు. దీపావళి నుంచి మూడు ఉచిత సిలిండర్లు కార్యక్రమం ప్రారంభిస్తున్నారని అన్నారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ 100 రోజుల పాలనపై ప్రజలకు వివరిస్తూ ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు చిన్నమ్మ టిడిపి నాయకులు చంద్ర పెద్ద స్వామి బజారు సమీవుల్లా కొంతలపాడు సుధాకర్ నారాయణ మండల తెలుగు యువత అధ్యక్షులు రాము, మహబూబ్ బాషా మధు పంచాయతీ సెక్రెటరీ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుండి బండిఆత్మకూరులో తితిదే ధార్మిక కార్యక్రమాలు

## తి.తి.దే. డాక్టర్ మల్లు వెంకటరెడ్డి


కరపత్రాలను విడుదల చేస్తున్న వెంకట రెడ్డి,భక్తులు

**బండి ఆత్మకూరు రూరల్, మేజర్ న్యూస్:** నేటి నుండి మండల కేంద్రమైన బండి ఆత్మకూరు లోని శ్రీ లక్ష్మీ జనార్దన స్వామి దేవస్థానం నందు తితిదే ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తితిదే హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లాల కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకట రెడ్డి తెలిపారు.సోమవారం ఆయన మాట్లాడుతూ మూడు రోజులపాటు ఇస్కాన్ ధర్మ ప్రచారకులు నిత్యతృప్త దాస్ చే శ్రీమద్రామాయణం, మహాభారతం భగవద్గీతలపై ప్రవచనాలు, స్థానిక భజన మండలిచే భజనలు, శుక్రవారం గోపూజ మరియు కుంకుమార్చన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందుకు సంబందించిన కరపత్రాలను స్థానిక భక్త సమాజంచే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భక్త మండలి సభ్యులు గుండా సునిత, జి.లక్ష్మీదేవి, రాజేశ్వరి, తులశమ్మ, బి.లక్ష్మిరెడ్డి, నారాయణ రెడ్డి,బి.సుధాకర రెడ్డి, నారాయణ, బి.రామిరెడ్డి, యం.నాగిరెడ్డి, కె.నాగపుల్లయ్య, యం.రామకృష్ణయ్య, ఎస్.కృష్ణారెడ్డి, భీమిశెట్టి నాగసుంకయ్య, శేఖర్, రాఘవాచారి, సుధాకర్ శర్మ , నాగేశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

**కల్లూరు మేజర్ న్యూస్ :** సీజనల్ వ్యాధులపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ అమృత అన్నారు. సోమవారం కల్లూరు మండలంలోని శ్రీనగర్ కాలనీ కే ఫోర్ చైతన్య పాఠశాల బ్రాంచ్లో పాఠశాల ఆర్ఐ రామాంజనేయులు ప్రిన్సిపల్ సుహాసిని ఆధ్వర్యంలో ఆరోగ్యభారత్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి సన్ రీత్ హాస్పిటల్ డాక్టర్ అమృత హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ అమృత పాఠశాల ఏజీఎం ప్రిన్సిపల్ విద్యార్థులతో మాట్లాడుతూ వర్షాకాలంలో వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు కలుషిత నీరు ఈగలు దోమలు వాలిన ఆహార పదార్థాలు తీసుకోవడం వల్ల సీజనల్ వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. ప్రతిరోజు గోరువెచ్చని మంచినీరు తాగుతూ పౌష్టికాహారం తీసుకోవాలని ఇమ్యూనిటీ పవర్




పెంచుకోవడానికి చిన్నప్పటి నుంచే ప్రతిరోజు వ్యాయామం చేస్తూ యోగ అలవాటు చేసుకోవాలని అన్నారు. రాత్రి పడుకునే సమయంలో దోమలు కుట్టకుండా దోమతెరలు ఉండేలా చూసుకోవాలన్నారు వీటితోపాటు మన చుట్టూ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేటట్లు చుట్టుపక్కల వారికి అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు చరవాణికి

# పరిమితం కావద్దు : ఎమ్మెల్యే



**నందికొట్కూరు మేజర్ న్యూస్ :** ఆధునిక సమాజంలో విద్యార్థులు చరవాణికి పరిమితమై వారిలో ఉన్న నైపుణ్యాలను గుర్తించ లేక పోతున్నారని,ఆ చరవాణి పక్కకు నెట్టి క్రీడల వైపు దృష్టి కేంద్రీకరించి మీలో ఉన్న నైపుణ్యాలను బయటకు తీస్తే ప్రపంచం గుర్తించే వ్యక్తులుగా ఎదగవచ్చు అని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయ సూర్య అన్నారు. సోమవారం నందికొట్కూరు మండలం లోని దామగట్ల గ్రామంలో జిల్లా పరిషత్ పాఠశాల లో మండల స్థాయి క్రీడా పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ విద్యార్ధిని, విద్యార్థులు క్రీడలలో పాల్గొనడానికి ఉత్సాహం కనబరచాలని క్రీడల వలన విద్యార్థులు శారీరకంగా, మానసికంగా దృఢంగా అవుతారన్నారు. క్రీడలలో నైపుణ్యం ఉన్న విద్యార్థులు వారి నైపుణ్యాన్ని మరింత మెరుగు పరుచుకావాలని సూచించారు. మన ప్రభుత్వం ,ప్రభుత్వ పాఠశాలకు అధిక ప్రాధాన్య తను ఇస్తుందని అన్నారు. ఎమ్మెల్యే విద్యార్థుల తో పాటు కబడి ఆడి వారిని ఉత్సాహపరిచారు.ఈ కార్యక్రమం లో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మాంద్ర సురేంద్రనాథ రెడ్డి, ప్రసాద్ రెడ్డి ,గ్రామ సర్పంచ్ మాధవరం సుశీలమ్మ ,యం.పి.టి.సి మాదిరెడ్డి తిప్పారెడ్డి, మండల విద్యా అధికారి సుభాన్, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయు రాలు అనిత జీవన్ , ఫిజికల్ డైరక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనుల సమస్యలపై

# కలెక్టర్‌కు వినతి

**మహానంది, మేజర్‌న్యూస్ :** మహానంది సమీపంలోని తెలుగుగంగ కాల్వ సమీపంలో ఉన్న చెంచులక్ష్మిగూడెం గిరిజన ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలంటూ నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియాకు వినతి పత్రాన్ని అందజేశారు. సోమవారం నంద్యాల కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సమస్యల పరిష్కార వేదికలో బిసి, ఎస్సీ సంఘాల నాయకులతో కలసి వెళ్లి ఆమెకు వినతి పత్రం అందజేశారు. తమ గూడెం సమస్యలను పరిష్కరించాలని కోరారు. గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం ఆర్ఓఎఫ్ఆర్ క్రింద భూములు అందించారని, అవి సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని గూడెం అధ్యక్షులు చలం చలం శ్రీనివాసులు తెలిపారు. అయితే ఇక్కడ బోర్లు బిగించుకునేందుకు విద్యుత్‌స్తంభాలను ఏర్పాటు చేసుకుంటుండగా అటవీ రేంజర్


కలెక్టర్ కార్యాలయం వద్ద గిరిజనులు నిరసన తెలుపుతున్న దృశ్యం

అడ్డుకుంటున్నారన్నారు. పొలాల్లో పంటలు బాగా పండి చేతికి వచ్చే సమయంలో నీళ్ళు కట్టుకునేందుకు విద్యుత్‌ను ఏర్పాటు చేసుకుంటుండగా అటవీ అధికారులు వేధిస్తున్నారని వారు ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. సమస్య పరిష్కరించకుంటే పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోతామన్నారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ తమ సమస్యను పరిష్కారించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపినట్లు వారు తెలిపారు. వీరి వెంట లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాన్ని అభివృద్ధి వైపు నడిపించాలి

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** నంద్యాల మండలంలోని చాపిరేవుల గ్రామంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్‌ప్లాంట్, సర్పంచ్ కార్యాలయాన్ని ముఖ్య అతిథిగా నంద్యాల టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఫిరోజ్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, న్యాయవాది తులసిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈసందర్భంగా ఫిరోజ్ మాట్లాడుతూ చాపిరేవుల గ్రామ ప్రజలు అందరూ కలిసికట్టుగా ఉండి చాపిరేవుల గ్రామాన్ని అభివృద్ధి వైపు నడిపించాలని కోరారు. అనంతరం ఇక్కడ వాటర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం చాలా మంచి పరిణామం అని తాగునీటిని అందరికీ అందించడం మంచి ఉద్దేశమని అన్నారు. ఇక్కడ సర్పంచ్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకోవడం వల్ల ప్రజలకు ఏ సమస్య వచ్చినా కార్యాలయానికి వచ్చి వారి సమస్యను తెలపడానికి


చాపిరేవులలో వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎన్‌ఎండి ఫిరోజ్, న్యాయవాది తులసిరెడ్డి

సులువుగా ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ రాజు, బాల స్వామిరెడ్డి, చంద్రశేఖర్, భూపాల్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, సుబ్బ రాయుడు, సంజీవ, రాజశేఖర్ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## హోంగార్డులు పోలీసుశాఖలో కీలకం

**– సదరన్ రీజియన్ హోంగార్డు కమాండెంట్ ఎం.మహేష్‌కుమార్**

**కర్నూలు క్రైమ్, మేజర్‌న్యూస్:** హోంగార్డులు పోలీసు శాఖలోని అన్ని విభాగాలకు చాలా కీలకమని సదరన్ రీజియన్ హోంగార్డు కమాండెంట్ ఎం.మహేష్‌కుమార్ అన్నారు. సోమవారం నగరంలోని పోలీసు కార్యాలయ పరేడ్ మైదానంలో హోంగార్డు పరేడ్‌ను నిర్వహించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎం.మహేష్‌కుమార్ మాట్లాడుతూ క్రమశిక్షణతో విధులు నిర్వహించాలన్నారు. ప్రజలకు మెరుగైన సేవలందించాలన్నారు. పోలీసుశాఖకు మంచి పేరు తీసుకరావాలన్నారు. ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జీవిత బీమాలో పాలసీలు చేసుకవాలన్నారు. విధుల్లో నైపుణ్యం


పరేడ్‌ను పరిశీలిస్తున్న దృశ్యం

మెరుగుపరచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హోంగార్డు డీఎస్పీ క్రిష్ణమోహన్, ఆర్ఐ జావేద్, హోంగార్డు సిబ్బంది పాల్గొన్నారు.

## బాల్య వివాహాలను నిర్మూలిద్దాం

**కల్లూరు, మేజర్‌న్యూస్:** సమాజంలో జరిగే బాల్య వివాహాలను నిర్మూలిద్దామని మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు అన్నారు. సోమవారం ముజఫర్ నగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వివాహ


అవగాహన కల్పిస్తున్న దృశ్యం

వయస్సుపై అవగాహన కల్పించారు. బాలికలకు 18ఏళ్లు, అబ్బాయిలకు 21ఏళ్లు పూర్తయ్యే వరకు వివాహాలు చేసుకోకూడదన్నారు. బాల్య వివాహాల వల్ల ఎన్నో అనర్థాలు జరుగుతాయన్నారు. ప్రస్తుత సీజన్‌లో ఇంటి పరిసరాల చుట్టూ నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మాస్ మీడియా అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు రామక్రిష్ణ, యశోధ, స్వర్ణలత, సచివాలయ ఆరోగ్య కార్యకర్త సునిత, ఆశాకార్యకర్త పాల్గొన్నారు.

## దేవరగట్టు ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలి

★ నెరణికి గ్రామంలో రాత్రి బస చేసిన సిఐ, ఎస్ఐ


గ్రామ ప్రజలతో మాట్లాడుతున్న సిఐ, ఎస్ఐలు

**హొళగుంద, మేజర్‌న్యూస్‌:** వచ్చే నెలలో జరిగే దేవరగట్టు వియదశమి బన్ని ఉత్సవాలను అందరు కలిసికట్టుగా ప్రశాతంగా నిర్వహించాలని ఆలూరు సిఐ శ్రీనివాస్‌నాయక్, ఎస్ఐ బాలనరసింహులు ప్రజలకు తెలిపారు. మండల పరిధిలోని నెరణికి గ్రామంలో సోమవారం రాత్రి బస చేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.


ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లను అతికిస్తున్న మాజీ జడ్పిటిసి మీనాక్షినాయుడు

### వంద రోజుల పాలనలో బాబు సంక్షేమ పథకాలు

## ప్రజలను ఆకట్టుకున్నాయి

**చిప్పగిరి, మేజర్‌న్యూస్:** తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఎన్నో ఆటంకాలను,విపత్తులను ఎదుర్కొంటూ చేపట్టిన సంక్షేమ పథకాలు ప్రజలను ఆకట్టుకున్నాయని మాజీ జడ్పిటిసి సభ్యులు మీనాక్షి నాయుడు, చంద్రశేఖర్ లు అన్నారు.సోమవారం మండలంలోని ఏరూరు గ్రామంలో ఇంటింటా తిరుగుతూ ఇది మంచి ప్రభుత్వం అని చెప్పిన సూపర్ సిక్స్ పథకాల్లో పెన్షన్,భూ హక్కు పథకాలను ప్రవేశ పెట్టిందని అన్నారు.అలాగే దీపం,ఉచిత బస్సు సౌకర్యాలను కూడా అందచేస్తామని చంద్రబాబు విజన్ ఉన్న వ్యక్తి అని ముందు చూపుతో రాష్ట్రంలో వరదలకు ప్రజలు ఇబ్బందులు పడకుండా కాపాడారని అన్నారు.కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి నరసింహులు,రావూరి తిమ్మప్ప,బాలకృష్ణ, బిసి రెడ్డి,రంగముని పంచాయతి కార్యదర్శి లు పాల్గొన్నారు.

### పేదల కోసం రూ.5లకే ఆకలి తీర్చిన ఘనత

## సీఎం చంద్రబాబుదే : గుడిసె కృష్ణమ్మ

**ఆదోనిరూరల్, మేజర్‌న్యూస్ :** పేదల కోసం రూ.5లకే అన్న క్యాంటీన్ల ద్వారా ఆకలి తీర్చిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కిందని రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, మాజీ టీడీపీ ఇంచార్జీ గుడిసె కృష్ణమ్మ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎంఐజిలోని నందు పార్కులో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా మాజీ టీడీపీ ఇంచార్జీ కృష్ణమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సంక్షోభంలో సంక్షేమ పథకాలను అందించి వంద రోజుల్లోనే పథకాలను సాధించారన్నారు. నిరుద్యోగ యువతకు అండగా నిలబడుతూ, మెగా డిఎస్సీతో 16,437 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ చేపట్టడం జరిగిందన్నారు. దీపావళి పండుగ సందర్భంగా మహిళలకు ఉచితంగా గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేసిప్రజల ఆస్తులకు భద్రత కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ బోయశాంతి, మున్సిపల్ అసిస్టెంట్ కమీషనర్ అనుపమ, జిల్లా మాజీ జనరల్ సెక్రటరీ భూపాల్ చౌదరి, రాష్ట్ర కార్యదర్శి బుద్దారెడ్డి, బిజెపి నాయకులు నాగరాజు గౌడ్, జనసేన నాయకులు రేణు వర్మ, జనసేన వీరమహిళ రాజేశ్వరి, మాజీ కౌన్సిలర్ మారుతి, ఓంకార్, శ్రీనివాస్ ఆచారి, రాఘవరెడ్డి, భరత్, వీరేష్, చిరంజీవి, బాబురావు, అల్తాఫ్, దేవేంద్ర, సిరాజ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మార్కెటింగ్ డీఈఈగా విజయకుమార్‌రెడ్డి



**కర్నూలు టౌన్, మేజర్‌న్యూస్:** కర్నూలు మార్కెట్‌యార్డు డీఈఈగా విజయకుమార్‌రెడ్డి సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ డీఈఈగా పనిచేస్తున్న సుబ్బారెడ్డిని ఆదోనికి బదిలీ చేశారు. ఆయన స్థానంలో అనంతపురంలో పనిచేస్తున్న విజయకుమార్‌రెడ్డిని కర్నూలుకు బదిలీ చేస్తూ మార్కెటింగ్ కమిషనర్ విజయసునిత ఉత్తర్వులు జారీ చేశారు.

## రాష్ట్రాభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం


మహానంది గ్రామంలో కూటమి ప్రభుత్వ బ్రోచర్లతో అధికారులు

**మహానంది, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం అవుతుందని తెలుగుదేశం పార్టీ నాయకులు పేర్కొన్నారు. సోమవారం మహానంది, మసీదుపురం, గాజులపల్లె గ్రామాల్లో ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తి కావడంతో ప్రజా సంక్షేమానికి తీసుకొని వచ్చిన సంక్షేమ పథకాలపై ప్రజలకు నాయకులు, అధికారులు వివరించారు. మహానంది గ్రామంలో తహశీల్దార్ రమాదేవి, టీడీపీ నాయకులు సుదర్శన్‌రెడ్డి, రాజా, రామచంద్రుడు, సూర్య శ్రీనివాసులు గాజులపల్లె గ్రామంలో పడకండ్ల నాగేశ్వరరావు, మహేశ్వరరెడ్డి, మసీదుపురం గ్రామంలో నరాల చంద్రమౌళీశ్వరరెడ్డిలతోపాటు అధికారులు పాల్గొని ఇంటింటికి తిరుగుతూ బ్రోచర్లు అందించి స్టిక్కర్లు అతికిస్తూ వంద రోజుల పాలన పై వివరించారు.

### బీచ్ సెపక్‌తక్రా ఛాంపియన్‌షిప్‌లో

## భారత జట్టుకు కాంస్య పథకం

**ఆలూరు, మేజం న్యూస్ :** చైనా దేశంలోని కింగ్ డావ్ లో ఈ నెల 18 నుంచి 23వ తేదీ వరకు జరిగిన ఆసియా బీచ్ సెపక్ తక్ర పురుషుల భారత జట్టుపోటీల్లో కాంస్య పథకాన్ని దక్కించుకుంది. వరుసగా ప్రత్యర్థ దేశాల జట్లపై విజయాలు సాధిస్తూ సెమీఫైనల్స్ లో జరిగిన పోటీలో పరాజయం చెంది కాంస్య పథకాన్ని దక్కించుకుంది. ఈ జట్టులో కర్నూలు జిల్లా ఆలూరుకు చెందిన కురువ మధు భారత జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించి భారత జట్టు విజయంలో ప్రధాన భూమికగా పోషించి జట్టు విజయానికి కృషి చేయడం జరిగిందని తెలిపారు. ఆలూరు కు చెందిన మధు గతంలో అనేక రాష్ట్ర, జాతీయి స్థాయిలో పాల్గొన్న కారణంగా ఇటీవల ఢిల్లీలో జరిగినటువంటి భారత జట్టు ఎంపిక పోటీలు చక్కటి నైపుణ్యాన్ని ప్రదర్శించి జుట్టులో


కాంస్య పథకంతో భారత దేశ బీచ్ సేపక్ తక్ర క్రీడాకారులు

స్థానం సంపాదించారు. చైనా దేశంలో జరిగిన ఆసియా పోటీలలో మన రాష్ట్రం నుండి పాల్గొని పథకముతో తిరిగి వస్తున్న కురువ మధుకు రాష్ట్ర సేపక్ తక్రా సంఘం సభ్యుల తరఫున ప్రత్యేక అభినందనలు తెలుపుతూ వివిధ జిల్లా క్రీడాకారుల సంఘం అధ్యక్ష,కార్యదర్శులు కూడా అభినందనలు తెలిపారు.

### డోన్ ఎమ్మెల్యే కోట్ల సహకారంతో

## గోరుమానుకొండ మోడల్ స్కూల్ విద్యార్థులకు బస్సు సౌకర్యం

**బేతంచెర్ల మేజర్ న్యూస్ :** బేతంచెర్ల మండల పరిధిలోని గోరుమానుకొండ గ్రామ ప్రజలు మరియు మోడల్ స్కూల్ విద్యార్థుల విన్నపం మేరకు డోన్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డిఏర్పాటు చేయడంతో మోడల్ స్కూల్ చైర్మన్ బాలకృష్ణ గ్రామ ప్రజలు విద్యార్థులు,ఉపాధ్యాయ సిబ్బంది డోన్ ఎమ్మెల్యే కోట్లకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడల్ స్కూల్ విద్యార్థుల సౌకర్యారం కోసం ప్రతిరోజు డోన్ నుండి వస్తు ఆర్. కొత్తపల్లె,ఆర్ బుక్కపురం, ఆర్ఎస్ రంగాపురం,హెచ్ కొట్టాల,బేతంచెర్ల పట్టణానికి చెందిన మోడల్ స్కూల్ విద్యార్థులను మోడల్ స్కూల్ వరకు మరియు గోరుమానుకొండ గ్రామ ప్రజలకు గ్రామ విద్యార్థులకు బస్సును ఏర్పాటు చేయడంతో బస్సును సోమవారం ప్రారంభించారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న టీడీపీ ఇంచార్జీ వీరభద్ర గౌడ్

## సంక్షోభంలో సంక్షేమం, అభివృద్ధి చంద్రబాబుకే సాధ్యం

**– టీడీపీ ఇంచార్జీ వీరభద్రగౌడ్**

**ఆస్పరి, మేజర్ న్యూస్ :** గత ఐదేళ్ల పాలనలో జగన్ రాష్ట్రాన్ని దివాలా తీయగా, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంక్షోభంలోను సంక్షేమం, అభివృద్ధిని పరుగులు తీస్తున్నాడని ఆలూరు టీడీపీ ఇంచార్జ్ వీరభద్రగౌడ్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ముత్తుకూరు గ్రామంలో సర్పంచు తోజోజప్ప అధ్యక్షతన నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఎన్నికల్లో హమీల్లోభాగంగా, 100 రోజుల పాలనలో అవ్వతాతలకు పించన్ల నగదు పెంపు, మెగా డిఎస్సీ, అన్న క్యాంటిన్లు, ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేసి ప్రజల ఆస్తులకు భద్రత కల్పించారు. జగన్ ప్రభుత్వంలో ఇసుక, లిక్కర్, భూ కబ్జాలు, మాఫీయా చివరికి శ్రీవారి లడ్డు ప్రసాదాల్లో కల్తీ నెయ్యి రాజకీయాలు నడిచాయన్నారు. గ్రామాల్లో వేసిన సీసీరోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి పథకాలు 2014 నాటి టీడీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ పరమరెడ్డి, మాజీ ఎంపిపి కృష్ణ యాదవ్, మధు, మాజీ ఎంపిటీసీ మల్లికార్జున, హరి, కృష్ణారెడ్డి, అరవింద్, శివకుమార్, శేషిరెడ్డి, గోవిందు, గోపాల్, రాజశేఖర్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సూర్య

మంగళవారం | 24 సెప్టెంబరు 2024

# సూపర్ సిక్స్ పథకాలను దశలవారిగా అమలు చేస్తాం

**గోనెగండ్లలో రూ. 50లక్షతో అభివృద్ధి పనులకు శ్రీకారం**



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ

**గోనెగండ్ల, మేజర్‌న్యూస్ :** ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ పథకాలను దశలవారిగా సీఎం చంద్రబాబు నాయుడు అమలు చేసి తీరుతారని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రమైన గోనెగండ్లలో ఎస్సీ కాలనీలో ఇదిమంది ప్రభుత్వం ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీవీ హజరయ్యారు. దాదాపు రూ. 50 లక్షలతో గ్రామంలోని పలు వీదులలో సీసీ డ్రైనేజి పనులకు ఎమ్మెల్యే బీవీ భూమి పూజ చేశారు. ఆయా కాలనీలోని ప్రజలతో మాట్లాడి వారి సమస్యలనున ఆడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోనెగండ్లలోని పలు వీదులలో సమస్యలు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. వచ్చే దీపావళికి ఉచిత గ్యాస్ సిలిండర్ పథకంను ప్రారంబిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతామని అన్నారు. కూటమి ప్రభుత్వ ఏర్పాటయ్యి కేవలం 100 రోజుల మాత్రమే అయిందని ఇది గుర్తు పెట్టుకొని వైసీపీ నాయకులు మాట్లాడాలని ఆయన సూచించారు. వైసీపీ నాయకులు ఆ ప్రభుత్వంలో ఎమ్మిగనూరుకు చేసిన ఒక్క మంచి పని చెప్పాలని ఆయన ప్రశ్నించారు. గతంలో టీడీపీ పాలనలో ఆర్డీఎస్ పనులకు గాను రూ. 2వేల కోట్లు మంజూరు చేయిస్తే వైసీపీ ప్రభ త్వం రివండర్ పేరుతో పనులకు నిలిపివేసిందన్నారు. ఆ ప్రాజెక్టును పూర్తి చేసే బాధ్యత తాను తీసుకుంటానని బీవీ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, మండల టీడీపీ కన్వీనర్ నజీరాసాహెబ్, తిరుపతయ్యనాయుడు, బేతాలబడేసా, రామాంజినేయులు, రమేష్ నాయుడు, నూరహమ్మద్, గ్రామ సర్పంచ్ హైమావతి, అడ్వకేట్ చం ద్రశేఖర్, వెంకటేశ్వర్లు, మదీనా, మిన్నల్ల పుట్టపాశం వెంకటేశ్వరాచారి, కులుమాల రాముడు, కులుమాల చాంద్, టీడీపీ నాయకులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రహదారులను బాగు చేయండి




రహదారిపై నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** ప్రధాన రహదారులైన ఎమ్మిగనూరు –కోడుమూరు, ఎమ్మిగనూరు– గూడూరు, ఎమ్మిగనూరు– కోసిగి రహదారులని బాగు చేయాలని కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఖాసీం వలి, యువ నాయకులు దాదా ఖాలందర్, ఎన్ఎస్యుఐ జిల్లా అధ్యక్షులు వీరేష్‌లు డిమాండ్ చేశారు. బీఈడీ కళాశాల దగ్గరధర్నాచేపట్టారు. వారు మాట్లాడుతూ వేలాదిమంది ప్రతిరోజు ఈ ప్రధాన రహదారుల గుండా ప్రయాణిస్తుంటారని, రహదారులు గుంతలు పడి చాలా దెబ్బతిని అద్వానంగా తయారయ్యిందని తెలిపారు. ఆర్ అండ్ బి అధికారులు ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం చాలా దారుణమని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు గుంతలు పడిన రోడ్లపై తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వర్షాకాలం రావడంతో రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయని తెలిపారు. కార్యక్రమంలో జయపాల్, నిషార్, సోమేశ్, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా మా భూమిని కాజేశారు..



**డోన్ రూరల్ మేజర్ న్యూస్ :** ఎన్నో ఏళ్లుగా తమ అనుభవంలో ఉన్న రెండు ఎకరాల భూమిని కొంత మంది వైసీపీ నాయకులు అక్రమంగా రికార్డ్‌లలో నమోదు చేసుకొని కాజేశారని ఉడుములపాడు గ్రామానికి చెందిన రైతు గువ్వల చంద్రుడు ఆరోపిం చారు. సోమవారం పొలంలో రాళ్లు తీసేందుకు వచ్చిన హిటాచి నిగ్రామస్థులతో కలిసి రైతు చంద్రడు అడ్డుకున్నారు. అనంతరం తహశీల్దార్ నాగమణికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని 178 సర్వే నెంబర్‌లో రెవిన్యూ రికార్డుల ప్రకారం గతంలో తమ పేరు పై ఉన్న భూమిని గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కొంతమంది వైసీపీ నాయకులు రెవి న్యూ అధికారుల అండదండలతో తమ పేరుపై నమోదు చేసుకొని కాజేశారని, సదరు విషయం పై అప్పటి తహశీల్దార్ కు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ వైసీపీ నాయకులకే వత్తాసు పలికారే కానీ తమ గోడు పట్టించుకో లేదని వాపోయారు. వైసీపీ నాయకుల భూ అక్రమాలపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో అయినా తమకు న్యాయం చేయాలని బాధిత రైతు ఉన్నతాధికారుల ను విజ్ఞప్తి చేశారు.

# ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను ముందు అమలు చేయండి



విలేకరులతో మాట్లాడుతున్న భూమా కిషోర్ రెడ్డి

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేసి ఆ తర్వాత ఇది మన మంచి ప్రభుత్వమని ప్రజల్లోకి వెళ్తే బాగుంటుందని తాలూకా నాయకులు భూమా కిషోర్ రెడ్డి అన్నారు.. స్థానిక స్వగృహంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దాదాపు వంద రోజుల పాలన పూర్తయిన కూడా ఎన్నికల ముందు టిడిపి మేనిఫెస్టోలో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు గాలికి వదిలేసారని విమర్శించారు.. మీరు ఏమి చేశారని చెప్పి మీరు ప్రజల్లోకి వెళ్తారని ప్రశ్నించారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితి బాగా లేదన్నారు. రైతులు పెట్టుబడి పెట్టే సమయమని.. అయితే రైతులకు వేయవలసిన డబ్బులు ప్రభుత్వం ఇంకా వేయలేదన్నారు. కౌలు రైతుల పరిస్థితి మరింత ఘోరంగా ఉందన్నారు. మహిళలకు ప్రతినెలా ఇస్తామన్న రూ. 15 వేలు, తల్లికి వందనము, ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్సు ప్రయాణం లాంటి హామీల ఊసే లేదని విమర్శించారు. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వస్తే తమకు మేలు జరుగుతుందని తమకు రావాల్సిన బకాయిలు వస్తాయని ఉద్యోగస్తులు ఆశించారని, వారికి రావాల్సిన బకాయిలు ఇవ్వకపోగా విజయవాడ వరద బాధితుల కోసం ఉద్యోగస్తుల జీతాల నుంచి కటింగ్ పెట్టారన్నారు.. వరద బాధితులకు ఇంతవరకు డబ్బులు ఇవ్వలేదన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ దిశగా ప్రభుత్వము ముందుకు పోతుందన్నారు. ప్రతి నియోజకవర్గంలో దోపిడీలు, అరాచకాలు జరుగుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ఇసుక ఇస్తామని చెప్పి ఇసుక పాలసీ తెచ్చిందని కానీ ప్రజలు ఇసుకతో ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రంలో పరిపాలన అధ్వానంగా ఉందన్నారు. మహిళలపై ఎన్నో అత్యాచారాలు జరుగుతున్నాయన్నారు. తిరుపతి లడ్డు ప్రసాదం గురించి మాట్లాడుతూ ఒక మతానికి సంబంధించిన నమ్మకాన్ని వమ్ము చేసే విధంగా దారుణమైన నిందలు వేస్తున్నారని మండిపడ్డారు. రాజకీయంలో ఇలాంటి నింద వేస్తారని కలలో కూడా అనుకోలేదన్నారు. ఏది ఏమైనా ఇది మంచి ప్రభుత్వమని ప్రజలు చెప్పాలని.. టిడిపి నాయకులు చెబితే ఎలా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో అంబటి మహేశ్వర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# ఇది మంచి కూటమి ప్రభుత్వం

**ఆళ్లగడ్డ ,మేజర్ న్యూస్ :** రుద్రవరం మండలం చిత్రేనిపల్లె, ముకుందాపురం గ్రామాలలో "ఇది మంచి కూటమి ప్రభుత్వం" అనే పేరుతో 100 రోజుల పరిపాలనలో రాష్ట్ర ఎన్డీఏ ప్రభు త్వం తీసుకున్న నిర్ణయాలను, అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన ప్రగతి గురించి ప్రత్య క్షంగా ప్రజలకు వివరించే కార్యక్రమంసోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆళ్లగడ్డ జనసేన పార్టీ సమన్వయకర్త మైలేరి మల్లయ్య, ముకుందాపురం గ్రామం టిడిపి నాయకు లు కోరే సంజీవ రాయుడు, రుద్రవరం మండలం జనసేన నాయకులు రాచంశెట్టి వెంకట సుబ్బయ్య ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రజలకు గడిచిన 100 రోజుల పరిపాలనలో చేసిన 100 అభివృద్ధి కార్యక్రమాలు సంక్షేమాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్య క్రమంలో పంచాయతీ కార్యదర్శిఆదిలక్ష్మి , ఆర్‌బి కే ఇన్చార్జి పవిత్ర మరియు సచివాలయ సిబ్బంది, టిడిపి, జనసేన నాయకులు దొడ్డి నరసయ్య, అంగ రామలింగం, మల్లికే చిన్నయ్య, పగడాల సుబ్బా రావు, గోవు సుబ్బారావు, దూదేకుల ఇమామ్ హుస్సేన్, పడకండ్ల నరేంద్ర గౌడ్, మైలేరి గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.



# గత టిడిపి హాయంలోనే గ్రామాభివృద్ధి.. ఇంటింటికి సంక్షేమం..

**జిల్లా టిడిపి అధ్యక్షులు తిక్కారెడ్డి..**
**100 రోజుల్లో అభివృద్ధి చేసి చూపిన ఘనత కూటమి ప్రభుత్వానిదే కే.ఈ**



**వెల్దుర్తి రూరల్ మేజర్ న్యూస్:** 100 రోజులలో ప్రజలకు అభివృద్ధి చేసి చూపించిన ప్రభుత్వం కూటమి ప్రభుత్వానిదేనని పత్తికొండ నియోజకవర్గ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు సోమవారం మండల పరిధిలోని బోగోలు గ్రామంలో ఆయన ఇది మంచి ప్రభుత్వమనే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే తో పాటు జిల్లా టిడిపి అధ్యక్షులు తిక్కారెడ్డి ముఖ్య అతిథులుగా ఈ కార్యక్రమానికి హాజరై ప్రజలతో ఆయన మాట్లాడుతూ గత టిడిపి హాయంలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు పుష్కలంగా అందాయని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వంలో అన్ని వ్యవస్థలు సర్వనాశనమయ్యాయని ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేశారన్నారు.

# కష్టాలలో ఉన్న వారిని ఆదుకోవడం మన బాధ్యత..



**డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి..**

**డోన్ ,మేజర్ న్యూస్ :** కష్టాలలో ఉన్న సాటి మనుషులను ఆదుకోవడం మనందరి బాధ్యత అని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో విజయవాడ వరద బాధితుల సహాయార్థం విరాళాల సేకరణ కోసం కూటమి శ్రేణులతో ఎమ్మెల్యే కోట్ల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఇప్పటికే కోట్ల రెండు లక్షల రూపాయలు విరాళం ప్రకటించినప్పటికీ మరలాఒక లక్ష రూపాయల విరాళం ప్రకటించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఎదో రూపకంగా సహాయాన్ని చేయాలని పిలుపునిచ్చారు. కోట్ల పిలుపునందుకున్న కూటమి శ్రేణులు తక్షణమే పదకొండు లక్షల రూపాయల విరాళాలు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ కొత్రికె హరికిషన్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, మాజీ ఎంపీపీ శేష్ ఫణి గౌడ్, ఓబులాపురం శేషిరెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ కేషన్న గౌడ్, డోన్ మండల టీడీపీ అధ్యక్షుడు వెంకట నాయుని పల్లె శ్రీనివాసులు యాదవ్, అంకిరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, ఖాజా పీర్, ఓం ప్రకాష్, సీమ సుధాకర్ రెడ్డి, జన సేన నాయకులు ఆలా మోహన్ రెడ్డి, బ్రహ్మం, బీజేపీ నాయకులు వడ్డే మహరాజ్ పాల్గొన్నారు.

# ఎస్ఐని కలిసిన ఉపాధ్యాయులు

**చాగలమర్రి,మేజర్ న్యూస్:** చాగలమర్రి నూతన ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన రమేష్ రెడ్డిని సోమవారం చాగలమర్రి పట్టణం లోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు కలిసారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ ను శాలువ, పూలమాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. పాఠశాలలో ఏమైన సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు పాఠశాలలు వదిలిన సమయంలో పాఠశాలల వద్ద పర్యటించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహబూబ్ భాష, రవీంద్రారెడ్డి, మహబూబ్‌భాష, పిడి దాదాపీర్, హరినాథ్‌రెడ్డిలు పాల్గొన్నారు.




# పారిశుద్ధ్య కార్మికులకు మెడికల్ క్యాంప్..

**డోన్ రూరల్ మేజర్ న్యూస్ :**

ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని స్వచ్ఛభారత్ మిషన్ ఏర్పాటై పది సంవత్సరాలు పూర్తి అయినా సందర్భంగా సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 02 వరకు బిజెపి నిర్వహిస్తున్న సేవా పక్షోత్సవాల్లో భాగంగా "స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం డోన్ మునిసిపల్ కార్యాలయం లో కమిషనర్ జయరాం అధ్యక్షతన మునిసిపల్ వైస్ చైర్మన్ కొత్రికే హరికిషన్ బిజెపి నియోజకవర్గ కోఆర్డినేటర్ వడ్డే మహారాజ్ ల ఆధ్వర్యంలో నిర్వహించటం జరిగింది. ఈ సంధర్బంగా మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు మరియు వారి కుటుంబ సభ్యులకి ఫ్రీ మెడికల్ క్యాంపు నిర్వహించటం జరిగింది. ఈ కార్యక్రమంలో స్వచ్ఛతా హీ సేవా మరియు పారిశుధ్య కార్మికుల ప్రాధాన్యత గురించి వివరించటం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డాక్టర్లు , ఉద్యోగులు మరియు బీజేపీ జిల్లా నాయకులు టైలర్ నాగార్జున, అవుకు వెంకటేశ్వర్లు పట్టణ కోఆర్డినేటర్ కోడి అశోక్ ప్యాపిలి మండల అధ్యక్షులు దామోదర్ నాయుడు, పోలా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# సీఎం ఆశయాలకు అనుగుణంగా పని చేస్తా..

**పత్తికొండ ఎమ్మెల్యే కె.యి శ్యాంబాబు**




**క్రిష్ణగిరి,మేజర్‌న్యూస్ :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయాలకు అనుగుణంగా పని చేస్తానని పత్తికొండ ఎమ్మెల్యే కె.యి శ్యాం కుమార్ అన్నారు.మండల పరిధిలోని కంబాలపాడు గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిదిగా ఎమ్మెల్యే శ్యాం కుమార్ హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ వంద రోజుల్లోనే ప్రభుత్వం ఎన్నో విజయాలను సాదించిందని ఆయన అన్నారు.పెంచిన పెన్షన్ల అమలు ఉద్యోగులకు సకమంగా జీతాలు నిరుద్యోగులకు మెగా డిఎస్సీ ఇంకా పలు పథకాలను దిగ్విజచంగా కూటమి ప్రభుత్వం అమలు చేసిందని ఆయన పెర్కొన్నారు.అలాగే సూపర్ సిక్స్ కార్యక్రమాలను అమలు చేయనున్నట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు ఆలంకొండ నబీసాహెబ్,ఎంపిడిఓ విశ్వమోహన్,ఈఓఆర్‌డి మురళీమోహన్,ఏఓ ఎస్.వెంకటేశ్వర్లు,వెలుగు ఏపిఎం మహేష్,సర్పంచ్ మారెమ్మ,ఎంపిటీసీ సభ్యులు చంద్రమ్మ, మాజీ సర్పంచ్ కె.యి శేషాద్రి,రమేషు,భాస్కర్‌రెడ్డి,మాదాపురం గురుస్వామి ,ప్రసాద్,బోయ బొంతిరాళ్ల రఫీ,సచివాలయ సిబ్బంది,ఇంకా పలువురు నాయకులు,కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# వంద రోజుల పాలనపై అవగాహన


మాట్లాడుతున్న కమిషనర్ గంగిరెడ్డి

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** కూటమి ప్రభుత్వంతోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగు తుందని టీడీపీ మాజీ కౌన్సిలర్లు ముల్లా కలీముల్లా, దాదా సాహెబ్, బోయ లక్ష్మీ, జహంగీ ర్‌బాషా, గౌస్‌లు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని 11,13, 15,16,17 వార్డుల్లో ఇదిమంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వందరోజుల పాలన పై ప్రజలకు అవగా హన కల్పించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పాల్గొన్నారు. ఈ సం దర్భంగా వారు మాట్లాడుతూ పింఛన్ 4 వేలకు పెంపు, అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేయడం, మెగా డీఎస్సీ ప్రకటించడం, దీపావళికి ఉచిత గ్యాస్ సిలిండర్ తదితర అంశాలపై అవగాహన పరిచారు. అభివృద్ధి సంక్షేమ ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తుందని తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలన్నిటిని సీఎం చంద్రబాబు నాయుడు దశలవారీగా అమలు చేసి తీరుతారని టీడీపీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ వరప్రసాద్, సిబ్బంది లెలిన్ బబు, వార్డు నాయకులు కామార్తి మహేష్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు..

**పట్టణ సిఐ. ఇంతియాజ్ భాష..**



**డోన్ రూరల్ మేజర్ న్యూస్ :** డోన్ పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ,రోడ్డు ప్రమా దాల నివారణల కోసం పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు పట్టణ సి.ఐ ఇంతియాజ్ భాష తెలిపారు.జిల్లా ఎస్ స్పీ అధిరాజ్ సింగ్ రానా ఆదేశాల మేరకు సోమవారం పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో డివైడర్ లైన్‌లను ఏర్పాటు చేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి తాము తీసుకుంటున్న చర్యలకు ప్రజలందరు సహకరించాలని కోరారు.అదేవిధంగా వాహన దారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు.ఈ కార్యక్రమంలో రూరల్ సిఐ సీఎం రాకేష్ ,పట్టణ ఎస్.ఐ శరత్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సమాజ సేవ తోనే సంతృప్తి..



**డోన్ రూరల్ ,మేజర్ న్యూస్ :** సమాజ సేవ తోనే సంతృప్తి అని టీడీపీ యువనాయకులు ధర్మారం భరత్ రెడ్డి అన్నారు.సోమవారం పట్టణంలోని ధర్మారం సుబ్బారెడ్డి కార్యాలయంలో భరత్ రెడ్డి పుట్టిన రోజు వేడుకలు ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఎమ్మె స్సార్ యూత్ ఆధ్వర్యంలో రోగులకు పళ్లు, బ్రెడ్‌లుపంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెస్సార్ యూత్ సభ్యులు బీఎడ్ భాష, పార్థ రెడ్డి,తేజ,బ్రహ్మం,ప్రసాద్,వలి,అర్జున్,మహేష్,రుక్మాన్,జహరుద్దీన్‌తదితరులు పాల్గొన్నారు.

# డిటీగా వీరేంద్ర గౌడ్ బాధ్యతలు స్వీకరణ


డిప్యుటీ తహసీల్దార్ వీరేంద్ర గౌడ్

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :**

ఎమ్మిగనూరు మండలం నూతన డిప్యూటీ తహసిల్దార్ గా వీరేంద్ర గౌడ్ సోమవారం బాధితులు స్వీకరించారు. బదిలీల్లో భాగంగా ఈయన కౌతాళం నుండి ఎమ్మిగనూరు తహసీల్దార్ కార్యాలయానికి బదిలీపై వచ్చారు. ఈ మేరకు తహసీల్దార్ శేషఫణికు కలిశారు.తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా దశిమి మహోత్సవం

**- కన్నుల పండుగ గా సాగిన ఆశ్వసేవ**


పూజలు అందుకుంటున్న చింతలాముని, నల్లారెడ్డి స్వాములు


పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి

**గోనెగండ్ల, మేజర్‌న్యూస్ :** బౌలిచేవారికి కొంగుబంగారంగా, భక్తుల కోర్కెలు తీర్చే చింతాముని నల్లారెడ్డి దశమి వేడుకలు అంగరంగ వైభవంగా సోమవారం ప్రారంభమయ్యాయి. ఆదోని డివిజన్లో అత్యంత వైభవంగా జరిగే ఉత్సవాల్లో గోనెగండ్ల దశమి ఉత్సవానికి ప్రత్యేక ఉంది. వేల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. దశిమి మహోత్సవం ఐదు రోజుల పాటు వైభవంగా జరునుంది. సోమవారం తెల్లవారుజామున పల్లకి సేవతో స్వామి వారి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. దశమి ఉత్సవంను భక్తులు ఘనంగా నిర్వహించారు. అలాగే 24వతేదిన సాంస్కృతిక కార్యక్రమాలు, 25వతేదిన పారువేట ఉత్సవం, 26వ తేదిన ఆరాధన ఉత్సవంతో స్వామివారి దశిమి ఉత్సవాలు ముగుస్తాయి.పొడి పంటలకు తెలిపే ఆశ్వం నడక: స్వామి వారి ఆశ్యసేవ ఎంతో ప్రాముఖ్యతను చోటుచేసుకుంది. ఆశ్వం ను సాక్షాత్తు స్వామి వారి రూపంగా భక్తులు కొలుస్తారు.దేవాలయ పీఠాధిపతులు స్వామివారి ఆశ్వాన్ని ప్రత్యేకంగా అలంకరించి దేవాలయంలో పూజలు చేశారు. అనంతరం రాత్రి 2 గంటలకు ఓబిలేసు స్వామి దేవాలయం నుంచి ఆశ్వాన్ని వేళతాళలతో ఊరేగిస్తు చింతలాముని నల్లారెడ్డి స్వామి దేవాలయం కు చేరుకుంది. ఆ దారిలో భక్తులు ఆశ్వానికి పళ్లు, పూలు సమర్పిస్తారు. ఆశ్వం కదిలే కదలికలను బట్టి ఆ ఎడాది పొడి పంటలు ఉంటాయాని భక్తుల నమ్మకం.ప్రముఖుల ప్రత్యేక పూజలు, చింతలాముని నల్లారెడ్డి స్వామివారి దశిమి మహోత్సవానికి సోమవారం ఎమ్మిగనూరు ఎమ్యెల్యే, రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు బీవీ జయనాగేశ్వరరెడ్డి, తో పాటువలు రాజకీయ పార్టీల నాయకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.

# గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ ఈవెంట్లో పాల్గొన్న ఎన్3 బ్రాంచ్ విద్యార్థులు




**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్:** పట్టణంలోని ఎన్‌జిఓస్ కాలనీలోని శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు ఈనెల 22 న విశాఖపట్నంలోని సి ఎం ఆర్ పంక్షన్ హాల్ మహిళా మనో వికాస్ క్రాఫ్ట్అండ్ క్రియేసన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రొ చెట్ స్కెవర్స్ యొక్క అతిపెద్ద ప్రదర్శన కోసంగిన్నిస్ వరల్డ్ ఈవెంట్లో శ్రీ చైతన్య పాఠ శాలవిద్యార్థులు కవిత,నిహారికలు పాల్గొని ఉలన్‌తో వస్తువులు చేయటంలో పాల్గొని గిన్నిస్ రికార్డ్ సాధించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల -3 బ్రాంచ్ ప్రిన్సిపాల్ మౌలాబీ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో టీవీలు, సెల్ ఫోన్‌లకు అలవాటు పడిపోకుండా ఇంత చిన్న వయస్సులో తమ పాఠశాల విద్యార్థులు ఇలాంటి ఒక కళ నేర్చుకుని గిన్నిస్ రికార్డ్ సాధించడం నిజంగా అభినందనీయమ న్నారు. ప్రతి విద్యార్థిలో ఒక ప్రతిభ దాగి ఉంటుందని ,ఆ ప్రతిభ ఈ లాంటి వాటిలో ప్రదర్శించాలని తెలిపారు ఈ కార్యక్రమంలో ఎజిఎం సురేష్ , ఆర్ఐ కోటయ్య చౌదరీ, ప్రిన్సిపాల్ మౌలాబీ, డీన్ షాల్మీయ పాల్గొన్నారు.

# అవార్డు అందుకున్న అధికారికి ఘన సన్మానం



**వెల్దుర్తి రూరల్ మేజర్ న్యూస్ :** జిల్లా ఉత్తమ వసతి గృహ సంక్షేమ అధికారిణిగా అవార్డును అందుకున్న వెల్దుర్తి బాలికల వసతి గృహ సంక్షేమ అధికారిణి శ్రీమతి శైలజకు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ భాష మరియు పరిశ్రమల శాఖ, ఫుడ్ ప్రాసెసింగ్ వాణిజ్య శాఖ మంత్రి వర్యులు టీ.జీ భరత్, జిల్లా ఎస్పీ బిందు మాధవ్ చేతుల మీదుగా ఉత్తమ వసతి గృహ సంక్షేమ అధికారిణిగా అవార్డును శ్రీమతి శైలజకు అందజేసిన విషయం పాఠకులకు తెలిసిందే, సోమవారం హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో వసతి గృహ సంక్షేమ అధికారిణి శైలజను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హెల్పింగ్ హాండ్స్ సేవా సంస్థ అధ్యక్షులుహరిసింహానాయుడు మాట్లాడుతూ ఎంతోమంది రైతు బిడ్డలకు, రైతు కూలీల బిడ్డలకు చక్కని వసతిని కల్పించి నిస్వార్థంగా వారి చదువులో రాణించడానికి ఎంతో కృషి చేసిన వెల్దుర్తి బాలికల వసతి గృహ సంక్షేమ అధికారిణి శ్రీమతి శైలజకు జిల్లా ఉత్తమ అధికారిణి అవార్డు రావడం ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు.హెల్పింగ్ హాండ్స్ సేవా సంస్థ తరపున ఆమెకు ధన్యవాదాలు తెలియజేశారు.ఇక్కడ చదువుతున్న పిల్లలందరూ ఆమెను ఆదర్శంగా తీసుకొని ఈసారి 500 పై చిలుకు మార్కులతో 105 మంది విద్యార్థినిలు అందరూ సాధించాలని వారికి పదవ తరగతి పరీక్షల్లో ఎలా విజయం సాధించాలో మోటివేషన్ చేశారు.రాబోయే విద్యా సంవత్సరంలో పదవ తరగతి ఉత్తమ మార్కులు సాధించిన వారికి వసతి గృహంలో నగదు బహుమతిని ఇస్తామని నార్లపురం చెందిన నారా నరసింహారావు చౌదరి మరియు సూదేపల్లెకు చెందిన వైద్యం రామనాయుడు హెల్పింగ్ హాండ్స్ సేవా సంస్థ తరపున ప్రకటించారు. ఉత్తమ వసతి గృహ సంక్షేమ అధికారిణిగా అవార్డును శైలజ మాట్లాడుతూనాయకులు, స్వచ్ఛంద సంస్థలు, పూర్వ విద్యార్థుల సహకారం మరువలేనిదన్నారు. ఎల్లవేళలా అండగా వుండాలని కోరారు.ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హాండ్స్ సేవా సంస్థ అధ్యక్షులు హరి సింహానాయుడు, హిందీ పండిట్ గఫూర్, వైద్యం రామనాయుడు, ఖాజా హుసేన్,మహానంది, మహేష్, విద్యార్థినీలు, తదితరులు పాల్గొన్నారు.

# సంక్షోభంలోను సంక్షేమం అందిస్తున్న కూటమి ప్రభుత్వం

**– టీడీపీ నాయకులు ఎల్.వి నాయుడు, రమణయ్య, క్రిష్టా రెడ్డి, నారాయణస్వామిలు**

**– ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు**


కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

**దొర్నిపాడుమేజర్,న్యూస్ః** సంక్షోభంలోనూ సంక్షేమం అందిస్తున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని టీడీపీ నాయకులు ఎల్.వి నాయుడు, ఎల్.వి రమణయ్య, క్రిష్ణా రెడ్డి, నారాయణస్వామిలు అన్నారు. సోమవారం మండల పరిధిలోని చాకరాజువేముల గ్రామంలో గ్రామ స్పెషల్ ఆఫీసర్ డిప్యూటీ తహశీల్దార్ ఆర్. మాధవ్, పంచాయితీ కార్యదర్శి నాగార్జునలతో కలిసి ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు ఎల్.వి నాయుడు మాట్లాడుతూ ప్రస్తుత కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ ఫలాలను అందించి కేవలం 100రోజులలోనే ఇది మంచి ప్రభుత్వం అని మంచి పేరు తెచ్చుకుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి ప్రకటన, ఎన్.టి.ఆర్ భరోసా ఫించన్ల పెంపు , అన్నా క్యాంటీన్లను ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. రాబోయే రోజుల్లో మరింత పారదర్శక పాలన అందించి ప్రజా మన్ననలు పొందుతామని వారన్నారు. ప్రభుత్వం వచ్చిన 100రోజులకే ఇంకా ఏమి చేయలేదంటూ వైసీపీ పార్టీ ప్రభుత్వంపై బురదజల్లే కార్యక్రమం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలుగుదేశం ప్రభుత్వం వచ్చిన తరువాత ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేసిందని రైతులను ఆదుకున్నామని డ్వాక్రా మహిళల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని డ్వాక్రా సంఘాలను బలోపేతం చేసేందుకు వారికి 5 నుంచి 10లక్షల వరకు రుణాలు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకున్నామని అక్టోబరు 1 నుంచి నాణ్యమైన మద్యం విధానాన్ని అమలులోకి తెస్తామని వారు తెలిపారు. ఇంటింటికి తిరిగి ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలు పంపిణీ చేస్తున్న సమయంలో ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని వారు సంతోషం వ్యక్తం చేశారు.గ్రామ స్పెషల్ ఆఫీసర్ ,డిప్యూటీ తహవీల్దార్ ఆర్. మాధవ్, పంచాయితీ కార్యదర్శి నాగార్జున, గ్రామ టీడీపీ నాయకులు ఎల్. వెంక టనాయుడు, ఎల్. రమణయ్య, గంగవరం క్రిష్టా రెడ్డి, నారాయణ స్వామి, భూషిరెడ్డి భాస్కర్ రెడ్డి, భూమా ప్రతాప్ రెడ్డి, ఎండూరి గోపాల్ నాయుడు, ఎండూరి మహేష్ , ప్రభాకర్, వి.ఆర్.వొ నాగేష్ , గ్రామ సర్వేయర్ కార్తిక్, సచివాలయ సిబ్బంది, టీడీపీ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

సూర్య



# సర్వేపల్లిలో ఫుడ్ కార్నివాల్



వంటకాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి

**కల్లూరు, మేజర్‌న్యూస్:** నగరంలోని కృష్ణానగర్ సర్వేపల్లి విద్యాసంస్థలో సోమవారం ఫుడ్‌కార్నివాల్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి ముఖ్యఅతిధిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి విద్యార్థులు తయారు చేసిన వంటకాలను రుచి చూసి ఎంతో మెచ్చుకున్నారు. అనంతరం పాఠశాల హెచ్ఎం కెపి.అరుణశ్రీ మాట్లాడుతూ విద్యార్థులను జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉంచే విధంగా, ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఎలా తీసుకోవాలో నేర్పడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్య మన్నారు. స్నాప్ కమ్యూనికేషన్ స్కిల్స్ ప్రోగ్రామ్ ద్వారా ప్రతిరోజు మనం వంట్లో వాడుకునే పదార్థాల పేర్లు వాటి తయారీ విధానం ఇంగ్లీషులో నేర్పడం వల్ల వారిలో ఇంగ్లీషు మాట్లాడటంలో గల భయాన్ని పోగొట్టడా నికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతా యన్నారు. విద్యార్థుల్లో పోటీతత్వం, మానసిక ఉల్లాసం, తల్లిదండ్రులకు సహాయపడటం, ఐక్యమత్యం లాంటి మరెన్నో విషయాలలు అలవడుతాయన్నారు. ఇందులో భాగంగా విద్యార్థులు రాయలసీమ కిచెన్, వీబీఎస్ కిచెన్, వివాహ భోజనంబు, కల్పత కిచెన్ లాంటి మరెన్నో జట్ల పేర్లతో క్యారెట్ హల్వా, రాగిముద్ద, పచ్చడి, సాంబర్, గుత్తి వంకాయ, రవ్వలడ్డు, గులాబ్‌జామున్, కేసరిబాత్, ఆహా-పోహ, ఘంటసాల-సుశీల వంటకం, మోతీచూర్‌లడ్డు, రబ్డీ, పెరిపెరి పొటాటో వంటి మరెన్నో వంటకాలతో పాల్గొని అందరినీ అలరించారు. అనంతరం సర్వేపల్లి విద్యాసంస్థల అధినేత పి.శేషన్న, దీక్షిత్ ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వంటకాలను పరిశీలిస్తున్న విద్యాసంస్థల అధినేత పి.శేషన్న



ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

# ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

- ప్రజల సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలి
- రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్



మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి:** ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్‌ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. సోమవారం నగరంలోని 15వవార్డు బుధవారపేటలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి టీజీ భరత్‌తోపాటు మున్సిపల్ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పటికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు, హామీలను అమలు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన 100రోలల్లో అద్భుతమైన విజయాలు సాధించిందన్నారు. ఇది మంచి ప్రభుత్వం అన్నారు. ప్రతి నెలా అర్హులకు పెన్షన్ అందిస్తున్నామన్నారు. కాలనీ వాసులు గతంలో తనకు పలు సమస్యలను విన్నవించారని వాటిని త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. సీఎం చంద్రబాబునాయుడు ఒక విజనరీ ఉన్న నాయకుడు అని, ఆయన రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తారన్నారు. కూటమి ప్రభుత్వం ఒక ప్రణాళికను రూపొందించుకొని ఆ దిశగా అడుగులు వేస్తుందన్నారు. మున్సిపల్ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల మంచి కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందన్నారు. వార్డుల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, నాగరాజుయాదవ్, సోమిశెట్టి నవీన్, కార్పొరేటర్ శివమ్మ, నాయకులు పామన్న, అబ్బాస్, రామాంజనేయులు, జేమ్స్, ముంతాజ్, రాజ్యలక్ష్మి, జూటూరు రవి, కిషోర్, గున్నామార్క్, తిమ్మోజీ పాల్‌రాజ్, రాజు, వార్డు నాయకులు, బూత్ ఇన్‌చార్జి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# ఉమామహేశ్వరుల పల్లకీసేవ

**బనగానపల్లె, మేజర్‌న్యూస్ :** యాగంటి శ్రీ ఉమామహేశ్వరుల దేవస్థానం నందు సోమవారం సందర్భంగా స్వామి వారి పల్లకి సేవ వైభవంగా నిర్వహించడం జరిగింది. ప్రదోషకాల ప్రస్తుత పూజల అనంతరం స్వామి, అమ్మవార్లను పల్లకీ నందు కూర్చొ బెట్టి వేద పండితుల పూజల అనంతరం ప్రధాన ఆలయం చుట్టూ పల్లకీ ఉత్సవం నిర్వహించారు. అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈ.వొ చంద్రశేఖర్ రెడ్డి, సర్పంచ్ మహేశ్వర రెడ్డి, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.



పల్లకిసేవ దృశ్యం

# విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం

- కర్నూలు జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్



వినతులు స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్

**కర్నూలు క్రైమ్, మేజర్‌న్యూస్:** ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి పరిష్కరించాలని జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను వినతులను స్వీకరించి ఫిర్యాదిదారులతో ఎస్పీ మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమానికి మొత్తం 133ఫిర్యాదులు వచ్చాయి. ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్టప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు, సీఐ శివశంకర్ పాల్గొన్నారు.

# కర్నూలు జిల్లాకు ఎంతో గర్వకారణం

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాష

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్:** దేశం గర్వపడే స్థాయిలో కర్నూలు జిల్లా క్రీడాకారిణి రేష్మ పవర్ లిఫ్టింగ్ సీనియర్ విభాగంలో నాలుగు పతకాలు సాధించడం గర్వకారణమని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాష అభినందించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో నేపాల్‌లో జరిగిన అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ సీనియర్ విభాగంలో నాలుగు పతకాలు సాధించిన క్రీడాకారిణి రేష్మను శాలువ, పుష్పగుచ్ఛంతో కలెక్టర్ సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేష్మ ఇలాంటి పతకాలు మరిన్ని సాధించాలని ఆకాక్షించారు. క్రీడా రంగంలో రాణించిన క్రీడాకారులను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం అండదండలు అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఎస్‌డీవో భూపతిరావు, పవర్ లిఫ్టింగ్ శిక్షకుడు వేణుగోపాల్ పాల్గొన్నారు.



క్రీడాకారిణి రేష్మను సన్మానిస్తున్న దృశ్యం

# నిర్ణీత సమయంలో సమస్యలను పరిష్కరించండి

అధికారులకు జిల్లా ఎస్పీ ఆదేశాలు

**నంద్యాల క్రైం, మేజర్‌న్యూస్ :** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదుదారులు అందించే సమస్యలను నిర్ణీత సమయంలో పరిష్కరించి వారికి న్యాయం చేయాలని నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పాల్గొని ఫిర్యాదుదారుల నుంచి నేరుగా ఫిర్యాదులను అందుకున్నారు. జిల్లా నలుమూలల నుంచి సుమారు 135 మంది తమ సమస్యలను జిల్లా ఎస్పీకి విన్నవించుకున్నారు. సమస్యల్లో ప్రధానంగా సివిల్ తగాదాలు, అత్తారింటి వేధింపులు, కుటుంబ కలహాలు, అన్నదమ్ముల ఆస్తి పంపకాల్లో వివాదాలు లాంటివి ఉన్నాయి. సమస్యలను సానుకూలంగా విన్న ఎస్పీ అక్కడికక్కడే పరిష్కారమయ్యే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేలా సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశించారు. ఫిర్యాదులు పునరావృత్తం కాకూడదన్నారు. అలాగే ఫిర్యాదుదారుల పట్ల నిర్లక్ష్యంగా మాట్లాడరాదన్నారు. ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు మోహన్‌రెడ్డి, ప్రియతమ్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, ఏరిషావలి, నిరంజన్‌రెడ్డి, యువరాజ్, సురేష్, ఎస్పీ సిసి నాగరాజులు పాల్గొన్నారు.





ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

# ప్రజా వినతులకు సత్వర పరిష్కారం చూపండి



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ రాజకుమారి

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమం ద్వారా స్వీకరించిన ప్రజా వినతులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాలులో ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొని జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్, డీఆర్వో పద్మజ, తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి వినతులను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజా ఫిర్యాదులను సీఎం మానిటర్ చేస్తున్న నేపథ్యంలో నాణ్యతతో ఫిర్యాదులను పరిష్కరించాలని నంద్యాల అర్బన్, రూరల్, పాణ్యం మండలాల్లో అధికంగా పెండింగ్ ఎక్కువగా ఉన్నాయని మండల స్థాయి సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించి క్లియర్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొన్ని మండలాల్లో ఫిర్యాదులను పిజిఆర్ఎస్ వెబ్‌సైట్‌లో చూడడం లేదని చూడడానికి కూడా ఇబ్బంది ఎందుకు పడుతున్నారని కలెక్టర్ అధికారులను ప్రశ్నించారు. ఫిర్యాదులలో అసంతృప్తి శాతం ఎక్కువగా ఉందని పాణ్యం, నంద్యాల, శిరివెళ్ళ మండలాల్లో అధికంగా అసంతృప్తి శాంత ఉందని ఆమె తెలిపారు. ఏపీ సేవ పోర్టల్ ద్వారా నిర్ణీత కాల పరిమితిని అధిగమించి సేవలు అందిస్తున్నారన్నారు. ముందు సబ్జెక్టు మీద కమాండ్ పెంచుకుని లోపం ఎక్కడుందో గుర్తించి సరిచేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సర్వే అండ్ ల్యాండ్స్, జిల్లా రిజిస్టర్ శాఖలలో ఫిర్యాదులు అధికంగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈకార్యక్రమలో 357 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్‌కు అర్జీలు సమర్పించారు.